www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 14 | నవంబర్ | 2025
పేజీలు : 8

## 16న జరిగే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి



**- ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలి**
**- సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సింగరేణి సంస్థ సౌజన్యంతో స్థానిక ఎంఎల్ఏ కూనంనేని సారధ్యంలో ఈనెల 16న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా తెలిపారు. ఈ జాబ్ మేళాలో 65 కంపెనీలకుపైగా పాల్గొంటున్నాయని, మూడు వేలకుపైగా ఉద్యోగాల కల్పన లక్ష్యంగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంస్థ ద్వారా విడుదలైన క్యూరో కోడ్ ద్వారా ఇప్పటి వరకు 3వేల మంది నిరుద్యోగులు తమ పేర్లను నమోదు చేసుకున్నారని మిగతా 2లో..

# బంధీ అవుతున్న బాల్యం..!

**-ఆటపాటలకు దూరం..సెల్‌ఫోన్‌తోనే జీవితం**
**-నేడు బాలల దినోత్సవం**





**ప్రజాపక్షం/ ఖమ్మం :** బాల్యం ఓ మధుర జ్ఞాపకం. బాధ్యతలు తెలియని వయస్సులో ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడపాల్సిన బాల్యం అటు తరగతి గదుల్లోనూ, హోం వర్క్‌లతో ఇంట్లోనూ బంధి అవుతుంది. ఇప్పటి బాల్యం అంటే తరగతి గదులు, హోంవర్క్‌లు, సెల్ ఫోన్లే. ఏడాది వయస్సు నుంచే సెల్‌ఫోన్ చూపితే ఏడుపు ఆగిన పరిస్థితికి బాల్యం నెట్టివేయబడింది. ఉదయం ఎనిమిది నుంచి తొమ్మిది గంటల మధ్య ప్రారంభమైన పాఠశాల సాయంత్రం నాలుగైదు అయితే తప్ప వదలడం లేదు. మిగతా 2లో..

## నిరుపేదలకు అండగా ప్రజా పాలన



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** రాష్ట్రంలో నిరుపేదలకు అండగా ప్రజా ప్రభుత్వ పాలన కొనసాగిస్తుందని రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనిసవారెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో గురువారం విస్తృతంగా పర్యటించారు. మంగాపురంతండా లో రూ.30 లక్షలతో, బుద్ధారంలో 15 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల కు శంఖు స్థాపన చేశారు. నేలకొండపల్లి తహశీల్దార్ కార్యాలయంలో 58 మంది లబ్దిదారులకు రూ.20.29 లక్షలను విలువ గల సీఎంఆర్ఎఫ్ "చెక్కులను అందించారు. ఈ

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

సందర్భంగా ఆయన మాట్లాడారు. గత 20, నెలలోనే మంగాపురంలో 57 లక్షలతో సీసీ రోడ్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మంగాపురం నుంచి నాచేపల్లి వరకు రూ.4.50 కోట్లతో బీటీ రోడ్లు పనులు చేస్తున్నట్లు తెలిపారు. రాయగూడెం నుంచి మంగాపురం వరకు 2.22 కోటతో రోడు పనులు పూరి చేసినట్లు తెలిపారు. 22 నెలలకాలంలో మంగాపురంతండా లో రూ.7.65 కోట్లు, పనులు వేగవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. బుద్దారంలో గ్రామంలో మిగతా 2లో..

## ప్రజల కోసమే ప్రజా ప్రభుత్వం



**ప్రజాపక్షం/ ముదిగొండ :** ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ప్రభుత్వాన్ని ప్రజలకు అంకితం చేసి పాలన సాగిస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. గురువారం ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని ముదిగొండ మండలం గంధసిరి గ్రామంలో కాకతీయుల కాలం నాటి శివాలయ పునః నిర్మాణ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పాల్గొన్నారు.ఈ సందర్బంగా జరిగిన సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన వారు తాము లేకపోతే రాష్ట్రంలో కరెంటు ఉండదని అంధకారమవుతుందని ప్రచారం చేశారన్నారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ ఎంత ఉన్న ఇబ్బంది లేకుండా ఉండేలా వ్యవస్థను నెలకొల్పామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ

**-విద్యుత్ డిమాండ్ పెరిగినా ఇబ్బందులు లేకుండా చర్యలు**
**-మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు**
**-శివాలయ పునః నిర్మాణ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి**

మేరకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. ఇందిరమ్మ లబ్దిదారులు ఎంత త్వరగా ఇండ్లు నిర్మించుకుంటే అంతే వేగంగా బిల్లులు మంజూరు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇండ్లు లేని పేదలకు ఐదు లక్షలతో ఇండ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రతి అసెంబ్లీ మిగతా 2లో..

# బంధీ అవుతున్న బాల్యం..!



(మొదటిపేజీ తరువాయి)

అంటే దాదాపు పగటి సమయమంతా తరగతి గదుల్లో బంధించబడుతున్నారు. సాయంత్రం విద్యా సంస్థ నుంచి బయటకు వచ్చి అరగంట నుంచి గంటన్నర సేపు బస్సు ప్రయాణం, ఇంటికి రాగానే హోంవర్క్ రోజంతా పసి మెదళ్లలోకి ఏమి చొప్పిస్తున్నారో తెలియదు కానీ ఎక్కువ సేపు బంధించే పాఠశాలలకు మంచి పేరు వస్తుందన్న ఆరోపణ లేకపోలేదు. ప్రైవేటు విద్యా సంస్థలకు ఆట స్థలాలు ఉండవు. అనుమతులకు ఆట స్థలాలు చూపిన అవి నిరుపయోగంగా ఉంటాయి. ఖాళీ సమయం దొరికితే సెల్‌ఫోన్‌తో ఆడటం, సెల్‌ఫోన్ కారణంగా మనుషుల అనుబంధాలు అడుగంటుతున్నాయనుకుంటే పిల్లల పరిస్థితి మరి ఘోరం. ఇరుగు పొరుగుకు దూరమవుతున్నారు. విద్యా బోధన పేరుతో పసి మెదళ్లపై ఒక పక్క దాడి జరుగుతుంటే మరో పక్క శారీరకంగా బలపడేందుకు దారుఢ్యాన్ని పెంచుకునేందుకు అవకాశాలు లేక బలహీనమైన భవిష్యత్తు గోచరిస్తుంది. ఎండకు వాడిన ఆకుకూర కట్టల్లా తయారవుతున్నారు. పిల్లల్లో నాటి చిరునవ్వులు మచ్చుకు కూడా కనిపించడం లేదు. పెద్దల ఆలోచనలు పిల్లలపై రుద్దుతున్నారు. ఆటలు ఆడితే, ఇతరులతో మాట్లాడితే తప్పు పిల్లలు చెడిపోతారన్న భావన తల్లిదండ్రుల్లో రోజు రోజుకు బలపడుతుంది. ఏడిస్తే సెల్‌ఫోన్‌లో బొమ్మలు చూపుతున్నారు తప్ప ఎత్తుకుని ఊరడించడం లేదు అంటే ఆంటీ అంకుల్ తప్ప మరో పదం పలకడం లేదు. బంధువులతోనూ సంబంధ బాంధవ్యాలు ఏర్పడడం లేదు. మహాకవి శ్రీశ్రీ చెప్పినట్లు అచ్చుటి కిచ్చుటి అనుకోకుండా ఎచ్చటి ఎచ్చటికో ఎగురుతూ పోయే పిల్లల్లారా అన్న చరణం ఇప్పటికీ బాల్యానికి తద్ విరుద్ధంగా ఉంది. పాఠశాలల్లో విద్యా బోధన పేరుతో ఒక పక్క తన కళలను సార్థకం చేసుకోవాలని తమ ఆశలకు అనుగుణంగా ఎదగాలన్న ఆలోచనతో తల్లిదండ్రులు బాల్యం మధురస్మృతులకు నేటి తరాన్ని దూరం చేస్తున్నారు. ఎదగడానికి ఎందుకురా తొందర ఎదర బతుకంతా చిందర వందర అన్న మనుసు కవి ఆత్రేయ మాటలను మననం చేసుకుంటే ఇప్పుడు ఎదగకముందే బాల్యం ఓ చట్రంలో బంధించబడుతుంది. స్వేచ్ఛలేని పసి మనుస్సులు ఆలోచనలను కోల్పోతున్నాయి.

పసి బాల్యం ఆశలన్ని
వసి వాడుతూ రాలుతున్నాయి
కార్పొరేట్ కసాయి మూకల
కాళ్ల క్రింద నలుగుతున్నాయి అని ఓ కవి చెప్పినట్లు బాల్యం బాల్యంలా గడపటం లేదు. ఇప్పటికే ఫారెన్ కోళ్లలా పెరిగి ఉద్యోగ వేటలో విఫలమై తల్లిదండ్రులకు భారమైన ఇప్పటి యువతరంతోనే ఇబ్బందులు పడుతుంటే సమాజ పోకడ తెలియని చాటు మాటుగా సెల్‌ఫోన్ స్నేహితులుగా పెరిగిన నేటి బాలలు రేపటి పౌరులైతే పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతుంది. మెరుగైన భవిష్యత్తు సమాజం కోసం అటు పాలకులు, ఇటు తల్లిదండ్రులు ఆలోచన చేయాలి. రక రకాల కోర్సుల పేరుతో పసిమెదళ్లను తొలిచి హింసావాదులుగా మారిన కార్పొరేట్ లేదా ప్రైవేట్ విద్యా సంస్థల్లో బంధి అయిన బాల్యాన్ని విడిపించే ప్రయత్నం చేయాలి లేదంటే పసి వయస్సులో చిరునవ్వులు దూరమై బేల చూపుల బాల్యం కండ్ల ముందు కనపడుతుంది.

## 16న జరిగే జాబ్ మేళాను
# సద్వినియోగం చేసుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. కొత్తగూడెం క్లబ్‌లో ఉదయం 9గం. నుండి సాయంత్రం 5 గం.వరకు జాబ్ మేళా జరగనుందని, శిబిరంలో కూడా నమోదు ప్రక్రియ చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపార.ఉ శిబిరాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,స్థానిక ఎంఎల్ఏ కూనంనేనితో కలిసి ప్రారంభిస్తారని , వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సింగరేణి అధికారులు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. జిలాల్తో పాటు ఇతర జిల్లా నిరుద్యోగులు కూడా ఈ జాబ్ మేళాలో పాల్గొనే అవకాశం ఉందని, సిపిఐ, యువజన, విద్యార్థి, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నట్లు సాబీర్ పాషా చెప్పారు.

# నిరుపేదలకు అండగా ప్రజా పాలన



(మొదటిపేజీ తరువాయి)

22 నెలల కాలంలో రూ.12 కోట్ల తో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. రెండు లక్షల వరకు పంట రుణాలు పూర్తిగా మాఫీ చేసినట్లు తెలిపారు. రైతుల కు మద్దతు ధర తో పాటు రూ.500 బోనస్, రైతు భరోసా కింద రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. ఉచిత విద్యుత్, సన్నబియ్యం. నూతన రేషన్ కార్డులు వంటి సంక్షేమ కార్యక్రమాలుఅమలు చేస్తున్నామని అన్నారు. పేదలకు సొంతింటి కల ప్రజా ప్రభుత్వం మొదట విడత లో 4.5 లక్షల ఇండ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ఇండ్లు మంజూరు చేస్తామని పేర్కోన్నారు. విద్య, వైద్య రంగం కు పెద్దపీట వేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మినారాయణ, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ రమేష్, మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, మామిడి వెంకన్న, బచ్చలకూరి నాగరాజు, ధీరావత్ రాధాకృష్ణమూర్తి, నల్లాని మల్లిఖార్జున్ రావు, నెల్లూరి భద్రయ్య, జెర్రిపోతుల అంజిని, గోబ్రియా నాయక్, కడియాల నరేష్, కన్నారెడ్డి, కొమ్మినేని విజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల కోసమే ప్రజా ప్రభుత్వం





(మొదటిపేజీ తరువాయి)

నియోజక వర్గంలో 3,500 చొప్పున 4.50 లక్షల ఇండ్లు నిర్మిస్తున్నామన్నారు. ప్రతి పైసా ప్రజల అవసరాల కోసమే ప్రజా ప్రభుత్వం ఖర్చు పెడుతుందని తెలిపారు. తెలంగాణ బిడ్డలు ప్రపంచంతో పోటీ పడేలా అధికారంలోకి రాగానే పెరిగిన మార్కెట్ ధరలకు అనుగుణంగా మెస్, డైట్ ఛార్జీలు పెంచామన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను ప్రతి అసెంబ్లీ నియోజక వర్గంలో ఒకటి చొప్పున నిర్మిస్తున్నామన్నారు. మహిళలు ఆత్మ గౌరవంతో బతికేలా వడ్డీ లేని రుణాలను అందిస్తున్నామన్నారు. మధిర నియోజక వర్గంలో 60వేల మంది మహిళా సభ్యులతో ఇందిరా మహిళా డెయిరీని ఏర్పాటు చేసి దేశానికే తలమానికంగా తీర్చిదిద్దామన్నారు. ఒక్కో మహిళకు రెండు గేదెలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే 70వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జాబ్‌మేళాను నిర్వహిస్తుందని తెలిపారు. గత పాలకులు పదేళ్ల పాటు రేషన్‌కార్డులు కూడా ఇవ్వలేకపోయారని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే రేషన్ కార్డును పంపిణీ చేశామన్నారు. మహిళలు ఎక్కడకు వెళ్లినా ప్రయాణ ఖర్చు లేకుండా ఆర్టిసి బస్సుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. రేషన్ షాపుల ద్వారా పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. రైతు సంక్షేమం కోసం పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. తొమ్మిది వేల కోట్లు రైతు భరోసా క్రింద నిధులు జమ చేసిందన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నామని ఆయన తెలిపారు. మధిర నియోజక వర్గ ప్రజలు వేసిన ప్రతి ఓటుకు గౌరవం తీసుకు వస్తామన్నారు. మధిర ప్రజల ఇంటి బిడ్డగా రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు,మాజీ ఎంఎల్ఏ కొండబాల కోటేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండ స్వామి, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం

**ప్రజాపక్షం/అశ్వాపురం:** వృద్ధులలో మానసిక స్థైర్యం కోల్పోకుండా ఉండటానికి వృద్ధుల మధ్య స్నేహభావం కలిగి ఉండటానికి ఇలాంటి వేడుకలు తోడ్పడతాయని ఆరిఫా రోష్ని వృద్ధా ఆశ్రమ నిర్వాహకురాలు షహనాజ్ బేగం అన్నారు. వయో వృద్ధులు దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా ఆదేశానుసారంగా




అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవ వేడుకలను గురువారం ఆరిఫా అండ్ రోష్ని రీమా వృద్ధాశ్రమంలో ఘనంగా జరుపుకున్నారు. ఆశ్రమంలో వృద్ధులచే ఆటల పోటీలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో వృద్ధులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. బాల్యంలోకి వెళ్ళినంత సంతోషం కలిగినదని సంతోషాన్ని వ్యక్తం చేసిశారు. ఈకార్యక్రమంలో ఆరిఫా అండ్ రోషిని వృద్ధాశ్రమ నిర్వాహకురాలు షహనాజ్ బేగం, మెహరాజ్‌లు పాల్గొన్నారు.

# నాణ్యతా ప్రమాణాలు సడలించి పత్తి కొనుగోలు చేయాలి

**ప్రజాపక్షం/తల్లాడ :** అధిక వర్షాలతో దెబ్బతిన్న పత్తి పంటను నాణ్యతా ప్రమాణాలు సడలించి మద్దతు ధరకు రైతుల నుంచి కొనుగోలు చేయాని తెలంగాణ రైతుసంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తల్లాడ మండలకేంద్రంలో ఉన్న



కాటన్ కార్పోరేషన్ అఫ్ ఇండియా(సిసిఐ) కొనుగోలు కేంద్రాన్ని తెలంగాణ రైతుసంఘం తల్లాడ మండల కమిటి ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు కొనుగోలు కేంద్రం ప్రారంబించి 20 రోజులైనా నేటికి 1500 క్వింటాల పత్తిని మాత్రమే కొనుగోలు చేశారని ఈకొనుగోలు కేంద్రం పరిదిలో సుమారు 6 నుంచి 8 మండలాల రైతులు పత్తిని తీసుకొస్తున్నారని నిబంధనల పేరుతో తిరస్కరిస్తున్నారని గత్యంతరం లేని రైతులు పత్తిని నాలుగు నుంచి ఐదు వేలవరకు దళారులకు అమ్ముకోవాల్సి వస్తుందని నిబంధనలు సడలించి పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈరోజు వరంగల్ సిసిఐ కేంద్ర ప్రాంతీయ కార్యాలయం వద్ద జరిగే రైతుల ధర్నాను జయప్రదం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కమిటి సభ్యులు శీలం సత్యనారాయణరెడ్డి, రైతుసంఘం సత్తుపల్లి డివిజన్ అధ్యక్షుడు నల్లమోతు మోహన్‌రావు, అయినాల రామలింగేశ్వరరావు, పులి కృష్ణయ్య, గుంటుపల్లి వెంకటయ్య, కుప్పాల నాగేశ్వరరావు, చల్లా నాగేశ్వరరావు, పేరసాని వెంకటప్పయ్య, దగ్గుల నారాయణరెడ్డి, బెల్లంకొండ సైదులు, దుగ్గిదేవర మురళీకృష్ణ, మూలగుండ్ల నాగేశ్వరరావు, వేల్పుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికుల భద్రతే ప్రధానం

**- సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ చందనాదీప్తి**

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** రైల్వే అస్తులతో పాటు ప్రయాణికుల భద్రతే ప్రధానంగా విధులు నిర్వహించాలని సికింద్రబాద్ ప్రభుత్వ రైల్వే ఎస్పి చందనాదీప్తి అన్నారు. గురువారం ఖమ్మం ప్రభుత్వ రైల్వే పోలీసు స్టేషన్‌ను కాజీపేట రైల్వే డిఎస్‌పి కృపాకర్‌తో కలిసి ఆమె ఆకస్మికంగా తనిఖీ



చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులను తనిఖీచేశారు. రైళ్లలో, రైల్వే స్టేషన్, సర్కిల్ పరిధిలో జరుగుతున్న నేరాలు, సిబ్బంది సంరక్షణ గురించి ఖమ్మం జిఆర్‌పి సిఐ ఎన్ అంజలిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైల్వే ప్రయాణికులు కోసం విధి నిర్వహణలో అంకితబావంతో పనిచేసి రైల్వే పోలీసు ప్రతిష్టను మరింత పెంపొందించుకోవాలని సూచించారు. తొలుత ఆమెకు స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు.

# రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో పాలకులు విఫలం



**-ఏఐకెఎంఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకెఎంఎస్) రాష్ట్ర గౌరవాధ్యక్షులు వి. కోటేశ్వర రావు తెలిపారు. ఏఐకెఎంఎస్ ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో గురువారం రైతాంగ సమస్యలను పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు బజ్జూరి వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర గౌరవాధ్యక్షులు కోటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, ఎం. రాజేంద్రప్రసాద్ లు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ వ్యతిరేక విధానాల వల్ల తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేయబడిందన్నారు. ఖమ్మం జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో వేలాది ఎకరాల్లో వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న వంటి పంటలను లక్షలాది రూపాయల పెట్టుబడులు పెట్టి సాగు చేశారన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, అతివృష్టి వల్ల గత నెలలో చివరిలో వచ్చిన మొంథా తుఫాన్ మూలంగా పంటలు పూర్తిగా దెబ్బతిని రైతాంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి కూడా తుఫాన్ సహాయక చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. తేమతో సంబంధం లేకుండా అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలన్నారు. మండల కేంద్రంలో సిసిఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్ ఏవోకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వై. ప్రకాష్, ఎస్‌కె ఖాసీం, సురేష్, సుదర్శన్, నాగయ్య, మురళి, అప్పారావు, శ్రీనివాసరెడ్డి, రామస్వామి, వీరస్వామి, ప్రజా సంఘాల రాష్ట్ర నాయకులు లక్ష్మి నారాయణ, రమేష్, మోహన్‌రావు, లక్ష్మి , జానకి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంత క్రికెటర్లను ప్రోత్సహించడమే టిసిఏ లక్ష్యం



**-త్వరలో టిసిఏ ఆధ్వర్యంలో గోల్డ్ కప్ టోర్నమెంట్**
**-టిసిఏ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ప్రదీప్‌కుమార్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ గ్రామీణ ప్రాంత క్రికెటర్లను ప్రోత్సహించడమే టిసిఏ ప్రధాన లక్ష్యమని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ప్రదీప్‌కుమార్, వీరేష్‌గౌడ్ లు తెలిపారు. తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో త్వరలో జరిగే తెలంగాణ గోల్డ్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌కు ముందస్తుగా ఐదు జోన్లలో ఒక్కో జోన్ నుంచి ఐదు జట్లను ఎంపిక చేసేందుకు ఈనెల 18 నుంచి ఆయా జోన్లలో ఓపెన్ సెలక్షన్స్ జరుగుతాయని వారు తెలిపారు. గురువారం ఖమ్మం సీక్వెల్ రిసార్ట్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈస్ట్‌జోన్ పరిధిలోకి వచ్చే ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, కోదాడ, మహబూబాబాద్, వరంగల్, భూపాలపల్లి, ములుగు, పరకాల, హన్మకొండ, స్టేషన్ ఘన్‌పూర్ జిల్లాల నుండి ఆరు క్రికెట్ జట్లను ఎంపిక చేసి ఫైనల్ టోర్నమెంట్‌కు పంపిస్తామన్నారు. నవంబర్ 18న ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం వేపకుంట్ల గ్రామంలో ఎస్ఎస్ క్రికెట్ మైదానంలో ఉదయం తొమ్మిది గంటల నుంచి ఓపెన్ సెలక్షన్ నిర్వహిస్తామన్నారు. క్రికెట్ పోటీల సెలక్షన్‌కు వచ్చే అభ్యర్థులు తమ డేటాఫ్ బర్త్‌తో ఉన్న ఆధార్ కార్డు కానీ, పుట్టిన తేదీ ధృవీకరించే పదవ తరగతి మెమో, పాన్‌కార్డు ఏదో ఒకటి తీసుకుని రావాలన్నారు. తెలంగాణ గోల్డ్ కప్‌కు సంబంధించి ఫైనల్ షెడ్యూల్ నవంబర్ చివరి వారంలో విడుదల చేస్తామన్నారు. ఈస్ట్, వెస్ట్, నార్త్, సౌత్ సెంట్రల్ జోన్లను కలుపుకుని మొత్తం ఐదు జోన్ల నుంచి ఒక్కో జోన్ తరుపున ఆరు జట్లను ఎంపిక చేసి 30 జట్లతో కలిపి గోల్డ్ కప్ టోర్నమెంట్ నిర్వహిస్తామన్నారు. క్రికెట్ సెలక్షన్స్‌కు వచ్చే వారు ఏమైనా సందేహాలు ఉంటే సెల్ నెం. 9848882551, 7989134190 నెంబర్లను సంప్రదించాలన్నారు. తమ ఎంట్రీలను ఫోన్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించడం టిసిఏ ప్రధాన లక్ష్యమన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ గతంలో దుర్వినియోగానికి పాల్పడి చేసిన తప్పులన్ని రుజువై నేడు బాధ్యులంతా జైలులో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిసిఏ జిల్లా ఉపాధ్యక్షులు నరాల నరేష్ మోహన్ నాయుడు, కోశాధికారి రవికుమార్, జాయింట్ సెక్రటరీ విడిఐ రాజీవ్ రాజ్, క్రికెటర్లు ఎండి ఇర్షాద్, రాజశేఖర్, వెంకట్, ఫణి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

# శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు విరాళాల సేకరణ



**ప్రజాపక్షం/చింతకాని :** డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ కు చింతకాని మండల వ్యాప్తంగా పార్టీ శ్రేణులు విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నాయి.ఇప్పటికే మండల సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి ప్రణాళికను సిద్ధం చేశారు. గ్రామల్లో వాల్ రైటింగ్ తో పాటు శాఖ సమావేశాలు ఏర్పాటు చేస్తూ ప్రచారాన్ని ప్రారంభించారు. ముగింపు సభ ప్రచారంలో భాగంగా గురువారం చింతకాని మండలంలోని చింతకాని గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఇంటింటికీ ప్రచార కార్యక్రమం నిర్వహిండంతో పాటు విరాళాల సేకరణ చేస్తున్నారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి మాట్లాడుతూ సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ కు ,చింతకాని నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పావులూరి మల్లిఖార్జున్, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, షేక్ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమంలో కాళోజీ పాత్ర మరువలేనిది



**ప్రజాపక్షం/ మధిర :** తెలంగాణ ఉద్యమంలో కాళోజి నారాయణరావు పాత్ర మరువలేనిదని మధిర నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ జెడ్పి చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. మహాకవి కాళోజి వర్ధంతి సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో కాళోజి పాత్ర ఎంతో ఉందని, అందుకే కాళోజి జయంతి సందర్భంగా రాష్ట్ర భాషా దినోత్సవంగా ప్రకటించి కాళోజిని గౌరవించుకోవటం జరుగుతుందని, తెలంగాణ కోసం, తెలంగాణ ప్రజల అభ్యున్నతి కోసం ఆయన రచించిన కవిత స్ఫూర్తిని వెలకట్టలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి అరిగె శ్రీనివాసరావు, మండల కార్యదర్శి బొగ్గుల భాస్కర్‌రెడ్డి, వైవి.అప్పారావు, ముత్తరపు ప్యారీ, ఇక్బాల్, ఆళ్ల నాగబాబు, బొగ్గుల వీరారెడ్డి, బోనకల్ మండల నాయకులు గంగవరపు రామకృష్ణ, కలిపవాయి జగన్, వేల్పుల శివ, అక్బర్, ఆవుల గోపి తదితరులు పాల్గొన్నారు.

# టాలెంట్ టెస్టులో న్యూవిజన్ విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విజ్ఞాన భారతి (విభ) నిర్వహించిన డిజిటల్ బేస్డ్ సైన్స్ టాలెంట్ సెర్చ్ ప్రతిభా పరీక్షలో న్యూవిజన్ విద్యార్థులు 60 మందికి పైగా ఫైనల్ లెవల్‌కి అర్హత సాధించినట్లు పాఠశాల ఛైర్మన్ సిహెచ్‌జికె ప్రసాద్ తెలిపారు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియమ్స్, భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వశాఖ, ఎన్‌సిఇఆర్‌టి (నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్) భారత విద్యా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో 2025 26 విద్యా సంవత్సరానికి గాను నిర్వహించిన టాలెంట్ టెస్టులో 60 మంది విద్యార్థులు ఫైనల్‌కు అర్హత సాధించారన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫైనల్ లెవల్‌కి అర్హత సాధించిన విద్యార్థిని, విద్యార్థులను అకాడమిక్ డైరెక్టర్స్ సిహెచ్ కార్తీక్, స్ఫూర్తి లు అభినందించారు. ఫైనల్ లెవల్‌లో కూడా రాణించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జెవి మైఖేల్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి పోటీలకు శ్రీచైతన్య విద్యార్థి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థి కోయడ మస్తాన్ (హెచ్‌ఈసిఐ) రాష్ట్ర స్థాయి క్రీడల్లో విశేష ప్రతిభ కనబర్చి కళాశాలకు గౌరవం తీసుకువచ్చినట్లు కళాశాల ఛైర్మన్ ఎం. శ్రీధర్, డైరెక్టర్ ఎం. శ్రీవిద్యలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో మస్తాన్ 400 మీటర్ల పందెంలో మొదటి స్థానం, 200 మీటర్ల పందెంలో మూడవ స్థానం సాధించినట్లు వారు తెలిపారు. తన ప్రతిభతో యు19 నేషనల్ ఎస్‌జిఎఫ్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ పోటీలు హర్యానాలో జరగనున్నాయన్నారు. రాష్ట్ర స్థాయి క్రీడల్లో విశేష ప్రతిభ కనబర్చిన విద్యార్థిని ఏజిఎం సిహెచ్ బ్రహ్మం, జి. గోపాలకృష్ణ, జి. ప్రకాశరావు, ఎగ్జిక్యూటీవ్ డిన్ ఎన్ఆర్ఎస్‌డి వర్మ, జోనల్ ప్రిన్సిపల్ రత్నాకర్, డిన్ కృష్ణ లు విద్యార్థిని అభినందించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్స్ జోజి చాకో, రవీందర్ లు విద్యార్థిని సత్కరించారు. జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలను సాధించాలని వారు ఆకాంక్షించారు. కోచ్ గౌస్ విద్యార్థి కృషి, పట్టుదల, ప్రతిభను ప్రశంసించారు.

# త్రివేణిలో క్రీడా వేడుకలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** బాలల దినోత్సవం సందర్భంగా త్రివేణి పాఠశాలలో వార్షిక క్రీడా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గురువారం ప్రైమరీ విద్యార్థులకు వివిధ క్రీడా అంశాలలో పోటీలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటారు. క్రీడా పోటీల ప్రారంభ సందర్భంగా విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గురుదత్తా నేత్రాలయ వైద్యులు ఎం. నందనందన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థులకు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి మాట్లాడుతూ విద్యార్థుల సార్వతోముఖాభివృద్ధికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యా సంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సిఆర్‌వో కాట్రగడ్డ మురళికృష్ణ, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా, చార్లెస్, సందీప్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తహశీల్దార్‌కు బీసీ నాయకుల వినతి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:**మండల తహశీల్దార్ పిల్లి రాంప్రసాద్‌కు ఎం, వెంకటాయపాలేనికి చెందిన బీసీ కులాల నాయకులు గురువారం వినతి పత్రాన్ని సమర్పించారు. తరతరాలుగా వారసత్వంగా కొనసాగుతున్న బీసీ స్మశానవాటిక స్థలాన్ని వేరొక సామాజిక వర్గం వారు తమదేనని బీసీలకు అన్యాయం చేస్తున్నారని వాపోయారు. దశాబ్దానికి పైగా కొనసాగుతున్న విధంగానే తమకే ఉండేవిధంగా కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు మునిగంటి వెంకన్న, నేరెళ్ల నాగేశ్వరరావు, దేవరకొండ ఉపేందర్, మునిగంటి నర్సింహారావు, ఉపేందర్, కుర్రా వెంకన్న, బాలిని యాదగిరి, తోకల పెద్ద వెంకన్న, నిదిగొండ బిక్షం, వెంకటేశ్వర్లు, రామగిరి నాగరాజు, గుండల సమ్మయ్య, పడిగల నాగేశ్వరరావు, మునిగంటి భార్గవ్ పాల్గొన్నారు.

## మిరప రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ప్రస్తుత వాతావరణపరిస్థితుల్లో మిరపలో వచ్చే వేరు కుళ్లను నివారించడానికి, రైతులు యాజమాన్య పద్ధతులను పాటించాలని పాలేరుడివిజన్ ఉద్యాన అధికారిణి పి. అపర్ణ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నివారణ చర్యల్లో భాగంగా ఎక్కువ నీటి తడులు ఇవ్వద్దని, కుళ్లతో ఎండిపోయి లేదా చనిపోయిన మొక్కలను వెంటనే వేళ్లతో సహా తీసివేయాలన్నారు. అలాగే 200లీటర్ నీటిలో 5కేజీల ట్రైకోడర్మావిరిడే, 3కేజీల సూడోమోనస్‌కు 10కేజీల బెల్లం కలిపి 24గంటల తర్వాత అన్ని మిరప మొక్కలకు పాదులు తడుపుకోవాలన్నారు. కాపర్ ఆక్సీక్లోరైడ్ 3జిఆర్, కోసైడ్ కాపర్ 2గ్రాములు లీటర్ నీటిలో కలిపి లేదా రోకో 2గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.

## రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ పోటీలకు మల్లెమడుగు విద్యార్థులు ఎంపిక



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఖమ్మం రూరల్ మండలం దానవాయిగూడెంలోని మల్లెమడుగు పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులు వెన్నెల, శ్రీవాణి,అనిత రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని పీటి బియ్యాని కృష్ణయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం వి.వి.పాలెంలోని సిడర్ వ్యాలి స్కూల్ గ్రౌండ్‌లో జరిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లా పోటీలలో మంచి ప్రతిభను కనబరిచి ఈ ఘనతను సాధించారు. వీరిని ప్రధానోపాధ్యాయులు సాంబమూర్తి, ఇంచార్జ్ కృష్ణవేణి, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షులు అలివేలు, 59,60వ డివిజన్ల కార్పొరేటర్లు నిరంజన్, లలితారాణి,గ్రామ పెద్దలు జానీమియా, తాటికొండ శ్రీనివాస్, తిరుపతిరావు, వైకుంఠచారి, బట్టపోతుల సతీష్, సైదులు, ఉపాధ్యాయులు అభినందించారు.

## బోర్డు లేని బస్టాండ్..!

**-అధికారుల నిర్లక్ష్యం**



ప్రజాపక్షం/పెనుబల్లి: నిత్యం ప్రయాణీకులతో రద్దీ గా ఉండే వి యం బంజర బస్టాండ్ నిత్యం వచ్చే పోయే బస్సులతో కళ కళ లాడుతుంది అలాంటి బస్టాండ్ కు కనీసం బోర్డు సైతం లేదు. అక్కడ ఉన్న ప్రయాణీకులను, బస్సులను చూసి ఇది బస్టాండ్ అని గుర్తించవలసిన దుస్థితి. ఆర్‌టిసి అధికారుల నిర్లక్ష్యం కనబడుతుందని ప్రయాణీకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా బస్సులు లోనికి, బయటకు వెళ్లే మార్గం లో సైతం సూచిక బోర్డులు సైతం లేవు. అందువల్ల బస్సులు లోనికి, బయటకు వెళ్లే సమయంలో అనేక సార్లు ప్రమాదాలు జరిగి అనేక మంది బాటసారులు, వాహనదారులు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు ఉన్నాయని ప్రయాణీకులు ఆరోపిస్తున్నారు. బస్టాండ్ వలన షాప్ లు, హోటల్, సైకిల్ స్థాండ్, వ్యాపార సముదాయాల వలన ఆర్ టి సి కి లాభాలు వస్తున్నాయని అయినా అధికారులు వి యం బంజర బస్టాండ్ ను పట్టించు కోవటం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ప్రమాదాలు జరిగిన తరువాత సానుభూతి తెలిపేకన్నా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారుల పర్యవేక్షణ కరువైందని విమర్శలు ఉన్నాయి. ఇకనైనా అధికారులు వియం బంజర బస్టాండ్ అభివృద్ధి పై అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

## అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

**-ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు**



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ 1వ వార్డులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కా ర్యక్రమంలో భాగంగా వార్డులో నిర్మాణ పనులు జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్లను పట్టణ కాంగ్రెస్ నాయకులు సీతారాములు వార్డు నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల కల పేదల పాలిట స్వప్నంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల గూడు కోసం ఎంతగానో ఆలోచించి పెద్ద ఎత్తున ఇళ్లు మంజూరు చేయడం జరిగిందని, ఇళ్ల నిర్మాణం వేగంగా జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైరా టౌన్ కాంగ్రెస్ పార్టీ నాయ కులు వీరంశెట్టి సీతారాములు, 1వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుడిగి వెంకన్నన, ఉపాధ్యక్షులు దురిశెట్టి నర్సింహారావు, కార్యదర్శి మోరు శ్రీకాంత్, 1వ వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకులు కురిసేటి నడిపి, దుగ్గిరాల జాకోబ్, గాజుల మహేష్, కురిసేటి పద్మ, మోరు కమల, పగిడిపల్లి ఆదిలక్ష్మి , శీలం మధు, శీలం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మధుమేహంకు చికిత్స లేదు..నియంత్రణే మార్గం..!

**-నేడు వరల్డ్ డయాబెటిస్ డే**




ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం: ప్రస్తుతం దేశవ్యాప్తంగా కోట్లాది మంది మధుమేహ వ్యాధిగ్రస్తులు ఉన్నారు. ఈ వ్యాధికి చికిత్స లేదు, కానీ సరైన ఆహారపు అలవాట్లు, జీవనశైలితో ఈ వ్యాధిని నియంత్రించవచ్చు. ఎప్పుడైతే దయాబెటిక్ పేషంట్లు తినడం, తాగడం వంటి విషయాల్లో అశ్రద్ధ చేస్తారో వారి శరీరంలోని రక్తంలో చక్కెర స్థాయి గణనీయంగా పెరుగుతుంది. దీన్ని నియంత్రించడానికి వారు బయటి నుండి ఇన్సులిన్ తీసుకోవడం పెంచాలి. మీకు మధుమేహం ఉంటే మీరు మీ జీవితమంతా మందులు తీసుకోవాలి. ఎందుకంటే నేటికీ ఈ వ్యాధికి చికిత్స లేదు. ఒక నివేదిక ప్రకారం..భారతదేశంలో 12 కోట్ల మంది మధుమేహ రోగులు ఉన్నట్లు అంచనా. ఈ వ్యాధి ఇతరులకు వ్యాపించకుండా నిరంతరం అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి సంవత్సరం నవంబర్ 14న దేశవ్యాప్తంగా ప్రపంచ మధుమేహ దినోత్సవం జరుపుకుంటారు. ఈ వ్యాధి గురించి మరింత సమాచారం తెలుసుకుందాం.

**-ప్రపంచ మధుమేహ దినోత్సవం చరిత్ర**

ప్రపంచ వ్యాప్తంగా ఈ రోజు ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని 1991 ప్రారంభించారు. అంతర్జాతీయ దయాబెటిస్ ఫౌండేషన్, ప్రపంచ ఆరోగ్య సంస్థ పెరుగుతున్న దయాబెటిస్ కేసులపై ఆందోళన వ్యక్తం చేశాయి. ఆ తర్వాత 2006లో ఐక్యరాజ్యసమితి ఈ రోజున ప్రపంచ మధుమేహ దినోత్సవంగా గుర్తించింది.

**-మధుమేహ కారణంగా...**

నేడు చిన్నవయస్సులోనే మధుమేహ బాధితుల మారడానికి మారిన బయట తినే ఆహారంలో అధికంగా క్యాలరీలు ఉండడం వల్ల మన శరీరంలో అదనపు కొవ్వు పేరుకుపోతుంది. దీని వల్ల మధుమేహం వచ్చే అవకాశం ఉంది. మధుమేహాన్ని నివరించడానికి మీరు మొదట మీ ఆహారపు అలవాట్లను మార్చుకోవాలి. ఇది కాకుండా, మధుమేహం రావడానికి జన్యు కారణాలు కూడా కావచ్చు.

**-వీరిలో మధుమేహం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందా?**

అధిక బరువు ఉన్నవారు టైప్ 2 దయాబెటిస్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. అందువల్ల బరువు తగ్గించుకోవడం చాలా ముఖ్యం. మీ బరువు మీ శరీరానికి అనుగుణంగా ఉంటే, మీ ప్రమాదం తక్కువగా ఉంటుంది. కానీ మీ తప్పుడు ఆహారపు అలవాట్ల వల్ల మీ బరువు పెరిగితే మధుమేహం వచ్చే ప్రమాదం కూడా ఉంది. ఒత్తిడి మనల్ని దయాబెటిస్ పేషంట్‌గా కూడా చేస్తుంది.

**-మధుమేహన్ని ఎలా నివారించాలి?**

మీకు మధుమేహం రాకూడదనుకుంటే ముందుగా వ్యాయామం చేయడం అలవాటు చేసుకోండి. వ్యాయామం చేయడం ద్వారా, మీ శరీరంల ఫిట్‌గా ఉండటమే కాకుండా మధుమేహం వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుంది. కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయడం అలవాటు చేసుకోండి. రోజులో పుష్కలంగా నీరు త్రాగాలి. అలాగే మీ ఆహారం పిండి, పంచదారంతో చేసిన వాటిని తక్కువ తీసుకోవాలి.

**-డయాబెటిస్ రోగులు ఏమి తినాలి?**

షుగర్ పేషంట్లు అల్పాహారంగా గంజి, ఓట్స్, చిక్‌పీస్ వంటి ఆరోగ్యకరమైన వాటిని తీనవచ్చు. ఇది కాకుండా ఖచ్చితంగా మీ ఆహారంలో ఆకుపచ్చ కూరగాయలను చేర్చుకోవాలి. మీరు నారింజ, సీజనల్, బొప్పాయి, ఆపిల్, కివీ పండ్లను తినవచ్చు. ఇది షుగర్ పేషంట్లకు మేలు చేస్తుంది.

**-నిర్లక్ష్యం.. ఆయుష్షుని పోగొట్టుకోవడమే..**



షుగర్ పేషంట్లు నిర్లక్ష్యంతో ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా లేకుంటే ఆయుష్షుని పొగట్టుకోవడమే. శారీరక శ్రమ లేకపోవడం, ఆహార మార్పులు, పర్యావరణకారకాలు, పర్యావరణ మార్పులు, మానసిక ఒత్తిడి, జన్యు ఉత్పరివర్తనలు, ఈ కారణాలన్నీ రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించే ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసే ప్యాంక్రియాస్‌ను అసాధారణ రీతిలో ప్రభావితం చేస్తున్నాయి. మధుమేహంతో జీవించేవారు ఆరోగ్యంగా ఉండాలంటే జీవితాంతం అప్రమత్తంగా ఉండాలి. దీనికి మూడు ప్రధాన సూత్రాలు ఉన్నాయి. మందులు వాడకం, ఆహార నియమాలు, వ్యాయామం.

**-డాక్టర్ కిరణ్‌కుమార్ గుడిగొండ**
**ప్రముఖ షుగర్, గుండె వైద్య నిపుణులు**
**దుర్గవిరించి మల్టీస్పెషాలిటీ హాస్పటల్,**
**హార్ట్ అండ్ డయాబెటిక్ సెంటర్ ఖమ్మం.**

## ప్రయాణికులకు ఎన్నాళ్లీ అవస్థలు..!

**-నిలువ నీడ లేదు.. కూర్చునే పరిస్థితి లేదు**
**-ఎండైనా, వానైనా రోడ్డుపైనే జనం పడిగాపులు**




ప్రజాపక్షం/జూలూరుపాడు: మండల కేంద్రంలోని బస్ షెల్టర్ నిర్మాణం చేపట్టాలని స్థానికులు ఎన్నో ఏళ్లుగా సంబంధిత అధికారులకు ప్రజా ప్రతినిధులకు విజ్ఞప్తులు చేస్తున్నా ఫలితం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రం నుండి భద్రాచలం, కొత్తగూడెం, ఖమ్మం వైపు వెళ్లే ప్రయాణికులు బస్టాప్ సెంటర్ నుంచే బస్‌లు ఎక్కుతుంటారు. రోజూ వందలాది మంది ఎక్కే ఈ స్టాప్ వద్ద ఎలాంటి షెల్టర్ లేకపోవడంతో ఎండకు, వానకు తడుస్తూ ప్రయాణికులు తీవ్ర అవస్థ పడుతున్నారు. స్థానిక గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఉన్న స్థలంలో ప్రజల అవసరాల మేరకు స్థానిక ఎమ్మెల్యే సైతం పంచాయతీ ఆధ్వర్యంలో వున్న స్థలంలో కొబ్బరి కాయ కొట్టి భూమి పూజ చేసినా, ఈ స్టాప్ వద్ద బస్ షెల్టర్ నిర్మించాలని చాలా రోజులుగా ప్రతిపాదనలు ఉన్నా ఇంతవరకు అది సాధ్యపడలేదు. కొత్తగూడెం సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణం చేపడుతామని పలువురు స్థల పరిశీలన చేసినా అవి కార్యరూపం దాల్చడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తక్షణం బస్ షెల్టర్, మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

**పట్టించుకోని పాలకులు, అధికారులు..**

గతంలో జూలూరుపాడు మండల కేంద్రంలో బస్సు షెల్టర్ ఉండేది. అది కాస్త రోడ్డు వైండింగ్‌లో కూల్చివేశారు. అప్పటి నుంచి ప్రయాణికులకు కష్టాలు తప్పడంలేదు. మండలకేంద్రంలో బస్‌స్టాండ్ నిర్మించేందుకు ప్రభుత్వ భూమి ఉందని, అక్కడే బస్‌స్టాండ్ నిర్మించాలని ప్రజలు అనేకమార్లు అధికారులకు, పాలకులకు మొరపెట్టుకున్నా కార్యరూపం దాల్చడంలేదు. ఇప్పటికైనా స్పందించి జూలూరుపాడు మండల కేంద్రంలో బస్ షెల్టర్‌తో పాటు మరుగుదొడ్లు, టాయిలెట్లు నిర్మించాలని జూలూరుపాడు మండల ప్రజలు కోరుతున్నారు.



**బస్ షెల్టర్ లేక ఇబ్బందిగా ఉంది : షేక్ చాంద్ పాషా, స్థానికుడు**

ప్రతి రోజూ స్కూళ్లకు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులకు ఈ స్టాప్ వద్ద షెల్టర్ లేకపోవడం చాలా ఇబ్బందిగా మారుతోంది. ఎండైనా వనైనా ఈ ప్రాంతంలో మహిళలు, చిన్నపిల్లలు విద్యార్థులు బస్సులు వొచ్చే అంతవరకు గంటల తరబడి రోడ్డు పక్కనే నిలబడుతున్నారు. తక్షణం సంబంధిత అధికారులు, బస్సు షెల్టర్, మరుగుదొడ్లు నిర్మించాలి.

**ఎండలో, వానలో నిల్చుంటున్నారు : సాయిల నరేష్, స్థానికుడు**

మండల కేంద్రంనుండి అవసరాల మేరకు పట్టణ కేంద్రాలకు ప్రజలు వెళ్లాలంటే నడిరోడ్డు పైనే బస్సులు ఎక్కుతుంటారు. ఇక్కడ ఎలాంటి బస్ షెల్టర్ లేకపోవడంతో ఎండలో, వానలో నిలబడాల్సి వస్తున్నది. ప్రభుత్వం తరపున లేదా స్వచ్ఛంద సంస్థలు షెల్టర్ నిర్మిస్తే బాగుంటుంది.

## సామిల్‌లో నిషేధిత కలప..!

**పట్టించుకోని అటవీ శాఖ అధికారులు**



ప్రజాపక్షం/కూసుమంచి: మండల కేంద్రం సమీపంలోని ప్రధాన రహదారికి పక్కన ఉన్న ఓ సామిల్(కట్టె మిల్లు)సమీపంలో నిషేధిత(చింత, నమిలినార మొదలైన) చెట్ల మొద్దులను ఎంతో కాలంగా నిల్వ ఉంచుతున్న కూసుమంచికి చెందిన ఓ సామిల్ యజమాని ఫారెస్ట్ అధికారులు పట్టించుకోకుండా ఒక రకంగా చెప్పాలంటే అతనికి సహకరిస్తూ నిషేధిత మొద్దుల వైపు కూడా చూడకుండా ఉంటున్నారనే విమర్శ తీవ్రంగా వినిపిస్తుంది. నిషేధిత చెట్ల మొద్దులే కాకుండా తక్కువ పర్మిట్లతో ఎక్కువ చెట్లను నరికి నిలువ చేసి ఉన్న వేప, తుమ్మ, మొదలైన చెట్ల మొద్దులు అనేకం నిల్వగా ఉండటం విశేషం. కూసుమంచిలో చెట్లు నరికే డాన్‌గా పేరుపొందిన అతనిపై చర్య తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందని జనం అంటున్నారు.

**ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇస్తే అక్రమార్కులకు అందజేత....**

కూసుమంచి ఫారెస్టు అధికారుల తీరు చూస్తే ప్రభుత్వ ఫారెస్ట్ అధికార వ్యవస్థ పైనే నమ్మకం కోల్పోయే విధంగా ఉందని నిస్సందేహంగా చెప్పవచ్చు అందుకు ఉదాహరణలుగా ఇటీవల కూసుమంచి మండలంలో ఓ చోట నిషేధిత కట్టుల లోడ్ ఉందని చెప్పగా సమాచారం ఉన్న అందుకో లేకపోవడం, మరో మారి ఓ చోట లారీలో నిషేధిత, పరిమితులు లేకుండా నరికిన లోడు వేస్తున్నారని తెలియజేసిన లోడు వేస్తున్న లారీని పట్టుకోకపోవడం, ఇంకా ఓ చోట నిషేధిత చెట్ల మొద్దులు నిల్వ చేశారని ఫారెస్ట్ అధికారులకే తెలియజేస్తే అక్రమార్కులకు సమాచారం తెలియడంతో వారు ఆ నిషేధిత మొద్దులని వేరే చోటుకు తరలించడం చూస్తుంటే అధికారుల తీరు ఫారెస్ట్ వ్యవస్థ మీదనే నమ్మకం కోల్పోయే విధంగా ఉన్నది.

**నీతి తప్పుతున్న కూసుమంచి ఫారెస్ట్ అధికారులు...**

కూసుమంచి ఫారెస్ట్ అధికారులకు నిషేధిత చెట్ల నరికివేత వివరాలు నిల్వ ఉంచిన మొద్దులు పరిమితులు లేకుండా చెట్లు నరికివేత మొదలైన సమాచారాలు ఇటీవల కాలంలో ఫారెస్ట్ అధికారులకు అందజేసే క్రమంలో సమాచారం అందించిన వారితో అధికారులు మాత్రం మాటల్లో అత్యంత నీతివంతమైన మాటలు మాట్లాడుతూ ఆచరణలో లీకర్లుగా ఉండటం వారి చర్యల ద్వారా తెలుపుతున్న వైనం. కండ్లకు కట్టినట్టుగా తెలుస్తున్నది అయితే ఇటువంటి అధికారులపై ఉన్నత స్థాయి అధికారులు దృష్టి పెట్టక చూసి చూడనట్టుగా లేక తమకు సంబంధం లేని విధంగా వ్యవహరించడం వల్ల ఫారెస్ట్ వ్యవస్థను పట్టించుకోకపోవడం వలన కొందరు ఫారెస్ట్ అధికారులు ఇంటి దొంగలుగా ఉంటూ అక్రమ కలప వ్యాపారాలకు అండగా నిలుస్తున్నారని చెప్పటంలో ఎటువంటి సందేహం లేదని జనం చర్చించుకుంటున్నారు.



**చేలల్లో, ఇండ్ల ప్లాట్‌లల్లో కలప నిల్వలు...**

కూసుమంచి మండల కేంద్రం సమీపంలో ప్రధాన రహదారి సమీపంలో సామిల్(కట్టేమిల్లు) సమీపంలో నిషేధిత చెట్ల మొద్దులు(చింతా, నమిలి నారా మొదలైన) ఇంకా ఎటువంటి పర్మిట్లు లేకుండా నరికిన వేప తుమ్మ నిల్వలు సమీపంలోని చేలల్లో ఇళ్ల పాట్లలో మాబీర కట్టె, పిచ్చి మొక్కలలో కప్పుకొని ఉండటం విశేషం, కొన్ని సంవత్సరాలుగా అక్రమ మొద్దుల నిల్వలు నిర్వహిస్తున్నప్పటికీ కూడా ఫారెస్ట్ అధికారులు పట్టించుకోకపోవడంలో కారణమేమిటి అని, అటుగా రోజు వెళ్తున్న రైతులు కూలీలు ప్రజలకు అనుమానం వస్తు చర్చించుకుంటున్నారు. అంటే ఫారెస్ట్ అధికారులకు ఏమైనా సంబంధిత మొద్దు అక్రమ కలప వ్యాపారులు చేతివాటం ఇస్తున్నారా..అని జనం చర్చించుకుంటూ ఫారెస్ట్ అధికారులపై నమ్మకం కోల్పోతున్న వైనం కనిపిస్తుంది. ఇప్పటికైనా ఫారెస్ట్ అధికారులు మొద్దు నిద్ర నుండి మేల్కొని కూసుమంచితో పాటు పాలేరు, నాయకన్‌గూడెం, పెరిక సింగారం, గట్టు సింగారం, పోచారం లలో అక్రమ కలప వ్యాపార స్థావరాలపై చర్యలు తీసుకొని వారి నిజాయితీని నిరూపించుకోవాలని జనం కోరుతున్నారు.

## ఒంటరి మహిళలకు తోడ్పాటు అందించడం అభినందనీయం

**- ఐటిడిఏ పిఓ రాహుల్**




ప్రజాపక్షం/భద్రాచలం : ఒంటరి మహిళలు, వితంతువులు స్వశక్తితో జీవించేందుకు ఆత్మగౌరవం సంపాదించుకునేందుకు ఐటిసి పిఎస్‌పిడి బంగారు భవిష్యత్ ఎన్‌జిఓ సంస్థ తోడ్పాటు అందించడం అభినందనీయమని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. గురువారం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన ఐటిసి బంగారు భవిష్యత్ అతి నిరుపేద మహిళా సహాయ కార్యక్రమానికి ముఖ్యాతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ ఐటిసి వారు నిర్వహిస్తున్న బంగారు భవిష్యత్ నిరుపేద ఒంటరి మహిళలకు ఎంతో ఉపయోగం అన్నారు. మహిళలకు పలు రంగాల్లో శిక్షణ ఇచ్చి వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు పలు రకాల కార్యక్రమాలు నిర్వహించేందుకు తోడ్పాటు అందించడం గర్వకారణం అన్నారు. గ్రామా ల్లో అభివృద్ధి పనులు, పేదలకు తోడ్పాటు అందించి వారి భవిష్యత్‌కు చేదోడు వాదోడుగా ఉండి జీవితంలో స్థిరపడేలా సంస్థ ఎంతో కృషి చేస్తుందన్నారు. సంస్థ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.13వేల విలువగల సామాన్లు, 40 మందికి రూ.20 వేల విలువ గల కుట్టుమిషన్లు, కిరాణా వస్తువులు, బట్టల తోపుడు బండ్లు అందించి అమ్మకాలు జరుపుకునేందుకు మార్కెట్ సౌకర్యం కల్పించడం వలన ఆర్థికంగా నిలదొక్కుకుంటారన్నారు. అర్హత గల మహిళలు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుని జీవనోపాదిని మెరుగుపర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్, డిడి అశోక్, ఐటిసి చంగల్ రావు, జయప్రకాశ్, బంధన్ , ప్రథమ్, బైప్ స్వచ్ఛంద సంస్థల యువతియువకులు పాల్గొన్నారు.

## యాదవులకు మంత్రి పదవి, నామినేట్ పోస్టులను కేటాయించాలి

**జిఎంపిఎస్ మండల కార్యదర్శి ఎడ్ల తిరుపతిరావు**



ప్రజాపక్షం/నేలకొండపల్లి : రాష్ట్రంలో బీసీల్లోనే అత్యధిక జనాభా కలిగిన యాదవులకు మంత్రి పదవి నామినేట్ పోస్టులను కేటాయించాలని జి.ఎం.పి.ఎస్ నేలకొండపల్లి మండల కార్యదర్శి ఎడ్ల తిరుపతిరావు అన్నారు. గురువారం మండల లోని చెరువు మాధరం గ్రామంలో జిఎంపిఎస్ గ్రామ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో బీసీల్లోనే అత్యధిక జనాభా కలిగిన యాదవులకు మంత్రి పదవి, నామినేట్ పోస్టులను కేటాయించకపోవడం తీవ్ర అవమానకరమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఎంతో త్యాగం చేసిన యాదవులకు నాణ్యమైన వాటి దక్కాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. రాజ్యాలు ఏలిన చరిత్ర, లాలు, మూలయం వారసత్వం కలిగిన యాదవులు పోరాటం చేయకపోతే భవిష్యత్ తరాలకు తీరని అన్యాయం చేసినట్లు అవుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో యాదవుల పట్ల అన్యాయం జరుగుతుంటే యాదవులు మౌనంగా ఉండటం బానిసలతో సమానం అని అన్నారు. ఈనెల 16న యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గొర్రెల, మేకల పెంపకదారుల సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిఎంపిఎస్ మండల అధ్యక్షుడు తెల్లగొర్ల లింగుస్వామి యాదవ్, మండల బాధ్యులు మార్తి కొండలరావు యాదవ్, వల్లాజు, నరేష్, లింగయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## తిరిగి సొంత గూటికి శ్రీరామ్ హరీష్



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా ఆధ్వర్యంలో తిరిగి సొంత గూటికి శ్రీరామ్ హరీష్ చేరారు. గురువారం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రేసు ఎల్లయ్య, మండల కార్యదర్శి కొమరం హన్మంతరావు ఆధ్వర్యంలో సిపిఐలో చేరారు.ఈసందర్భంగా శ్రీరామ్ హరీష్ మాట్లాడుతూ సిపిఐ పార్టీలోనే కొనసాగుతానని, ఎర్రజెండానే నాకు అండ అని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల నాయకులు రేసు సురేందర్, గుంతోజు శివలు పాల్గొన్నారు.

## రమేష్‌కు పరామర్శ



ప్రజాపక్షం/కారేపల్లి: మండల పరిధిలోని మొట్లగూడెం పంచాయితీ చింతలపాడు గ్రామానికి చెందిన వాంకుడోత్ రమేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాలపాలయ్యాడు. కాలికి గాయం కావడంతో ఇంట్లోనే ఉంటు చికిత్స తీసుకుంటున్నారు. అతని యోగక్షేమాలను గురువారం వైరా మాజీ ఎంఎల్ఏ రాముల్ నాయక్ అనుచరుడు అజ్మీర వీరన్న అక్కడికి వెళ్లి పరామర్శించి, మనోధైర్యాన్ని కల్పించారు. ఈకార్యక్రమంలో స్థానికులు బాదావత్ అనిల్, వాంకుడోత్ పూర్ణ, ప్రశాంత్, సతీష్, హరి ప్రసాద్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



ప్రజాపక్షం/గుండాల : మండలంలోని ప్రతి పంచాయితీలో ప్రభుత్వం దాన్యం కొనుగోలు కేంద్రాలని ఏర్పాటు చెయ్యాలని సిపిఐ పార్టి మండల నాయకులు ఎస్కే సాహెబ్ పత్రికప్రకటన ద్వార ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల ఎక్కువ శాతం వర్షాదారిత పంటలైన వరి, మొక్కజొన్న పంటలను సాగు చేస్తున్నారని , అధిక వర్షాల కారణంగా చేతికి అందిన పంటలు పూర్తిగా తిన్నాయని కొంత శాతం చేతికి వచ్చిన మొక్కజొన్న పంట గిట్టు బాటు ధర లేక దళారుల పాలవుతుందన్నారు. ప్రభుత్వం మొక్కజొన్న పంటకు క్వింటాకు 24 వందలు ప్రకటించినప్పటికి మండలానికి సుదూర ప్రాంతాల పంచాయితీల రైతులు మండల కేంద్రానికి తెచ్చుకునే పరిస్థితిలేక దళారీ వ్యాపారులకు అమ్మకాలు జరిపి రైతులు తీవ్రంగా నష్టపోతున్న పరిస్థితుల దృష్య ప్రభుత్వం వ్యవసాయపరపతి సంఘం ద్వారా పంచాయితీలలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు.

## గిరిజన క్రీడాకారుడికి ఆర్థికసాయం



ప్రజాపక్షం/జూలూరుపాడు: జూలూరుపాడు మండల పరిధిలోని వీరభద్రపురం గ్రామానికి చెందిన గిరిజన యువకుడు డిగ్రీ మొదటి సంవత్సరం ఖమ్మంలో చదువుతున్నాడు. ఈ క్రమంలో క్రీడలపై ఆసక్తి పెంచుకొని 100 మీటర్ల పరుగు పందెం, హై జంప్ లలో జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి లలో రాణిస్తున్నాడు. ప్రస్తుతం నేషనల్ స్థాయికి కూడా సెలెక్ట్ అయ్యాడు. ఈ క్రమంలో నిరుపేద అయిన ఆ క్రీడాకారుడికి చేయూత ఇవ్వాలనే ఉద్దేశంతో వాకింగ్ క్లబ్ ఆరోగ్య జీవనయాత్ర సభ్యులు గురువారం తన ఇంటికి వెళ్లి సన్మానించి, రూ. 6000 ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆరోగ్య జీవన యాత్ర సభ్యులు మాట్లాడుతూ అశోక్ భవిష్యత్ మరింత ఉజ్వలంగా ఉండి జాతి స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. మారుమూల గ్రామంలో జన్మించి నిరుపేదగా ఉండి నేషనల్ స్థాయిలో రాణించడం జూలూరుపాడు మండలానికి గర్వకారణం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య జీవనయాత్ర సభ్యులు తిప్పర్తి శివ, ఎదలపల్లి వీరస్వామి, జానీ, షేక్ బుడెన్, మార్కాపురి నరసింహారావు, బోసు బండ్ల వెంకట్, గడిదేసి ప్రేమ్ కుమార్, పెండ్యాల నరేష్ ఉన్నారు.

## ప్రత్యేక లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి




ప్రజాపక్షం/కల్లూరు:రాజీమార్గమే రాజమార్గం అని, చిన్న చిన్న కేసులతో కోర్టులు చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృధా చేసుకోవద్దని న్యాయశాఖ కల్పించిన ప్రత్యేక లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కల్లూరు ఎస్సై హరిత అన్నారు. ఈనెల 15వ తేదీన జరిగే మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీకి అనుకూలమైన క్రిమినల్ కంపోండబుల్ కేసులు సివిల్ తగాదాలు, ఆస్తి విభజన,కుటుంబ పరమైన సమస్యలు, వైవాహిక వివాదాలు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్, వంటి కేసులు లోక్ అదాలత్ లో పరిష్కారం అవుతాయని ఎస్సై పేర్కొన్నారు. అదాలత్ ద్వారా బాధితులకు సత్వర న్యాయం కలుగుతుందని వివరించారు.

# గంగారంలో అర్ధరాత్రి హైటెన్షన్

**-తెలంగాణ సరిహద్దు నాకాబందీ..**
**-వాహనాలను స్వయంగా చెక్ చేసిన సిపి**





**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి మండలం గంగారం గ్రామంలో బుధవారం అర్ధరాత్రి హై టెన్షన్ మొదలైంది. పోలీస్ బాస్ సునీల్ దత్ ఆధ్వర్యంలో ఆంధ్రా, తెలంగాణ సరిహద్దు గ్రామమైన గంగారం గ్రామంలో సుమారు 50 మంది పోలీసులతో నాకాబందీ నిర్వహించారు.. ఆంధ్రా నుంచి ఇసుక అక్రమ రవాణా.. చత్తీస్గఢ్ తదితర ప్రాంతాల నుంచి గంజాయి, చట్ట వ్యతిరేకమైన మాదక ద్రవ్యాలు, ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించిన వ్యక్తులు తెలంగాణలోకి వస్తున్నట్లుగా సమాచారం అందిన నేపథ్యంలో బుధవారం రాత్రి మొదలుకొని గురువారం తెల్లవారుజాము వరకు నాకా బందీ నిర్వహించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కూడా సాగాయి. ఈ కార్యక్రమంలో ఏసీపీ రఘు, సీఐ శ్రీహరి తో పాటు పలువురు సబ్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా సిపి సునీల్ దత్ మాట్లాడుతూ ఎవరైనా అనుమానా స్పదంగా కనిపిస్తే వెంటనే పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వమని ప్రజలను కోరారు. గంజాయి, ఇసుక అక్రమ రవాణా, మాదకద్రవ్యాల తరలింపు తదితర కార్యకలాపాలు చట్టరీత్యా నేరమని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

# అధికారుల నిర్లక్ష్యంపై మంత్రి పొంగులేటి ఆగ్రహం



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని 6 మండలాల తహశీల్దార్లతో, అధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం సమీక్ష సమావేశం కల్లూరు మండలం నారాయణపురం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ప్రజలు నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు మంత్రి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా పేరువంచలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రహరీ నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని ఎంఈఓ కు ఆదేశించారు. సుమారు గంటసేపు పలు మండలాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలు విని వినతి పత్రాలను అందుకున్నారు. అనంతరం ఎన్ఎస్పి క్రాస్ రోడ్ లో ఉన్న వీరభద్ర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలను అందుకున్నారు. కొత్త నారాయణపురంలో ఇందిరమ్మ గృహాన్ని ప్రారంభించారు. మంత్రి వెంట కాంగ్రెస్ నాయకులు అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఏఎంసి చైర్మన్ భాగం నీరజాదేవి, మోహన్ నాయక్ లతోపాటు పలు ప్రభుత్వ శాఖల అధికారులు నివేదిత, తహశీల్దార్ పులి సాంబశివుడు, ఎస్సై హరిత పాల్గొన్నారు.

# ఎస్‌బిఐటికి ఎడ్యుకేషన్ చేంజ్ మేకర్ అవార్డు






**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఐటిసి అకాడమీ ప్రతి యేటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బ్రిడ్జ్ కార్యక్రమంలో 2025వ వార్షిక సంవత్సరానికి గాను ఖమ్మం ఎస్‌బిఐటి ఇంజనీరింగ్ కళాశాలకు ఎడ్యుకేషన్ చేంజ్ మేకర్ అవార్డు లభించింది. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన బ్రిడ్జ్ 2025 కార్యక్రమంలో తమిళనాడు రాష్ట్ర ఐటి శాఖ మంత్రి పళనివేల్ త్యాగరాజన్ చేతుల మీదుగా ఎడ్యుకేషన్ చేంజ్ మేకర్ అవార్డును ఎస్‌బిఐటి కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మూడు కళాశాలలను ఎంపిక చేయగా తమ కళాశాల మొదటి స్థానంలో నిలిచిందని గుండాల కృష్ణ తెలిపారు. ఉన్నత విద్యా ప్రమాణాలతో విప్లవాత్మక మార్పులు రూపొందించినందుకు తమ కళాశాల ఈ అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి మాట్లాడుతూ డిజిటల్ విద్యను అందించడంతో పాటు దిగ్గజ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకోవడం ఇన్నోవేషన్ సెల్ ఏర్పాటు రీసెర్చ్‌కు పెద్దపీట వేయడం వంటి విప్లవాత్మక మార్పులు అందించడం ద్వారా తమ కళాశాల రాష్ట్ర స్థాయిలో గుర్తింపు సాధించిందన్నారు. ఐటిసి అకాడమీ సహకారంతో విద్యార్థులు ఆధునీక సాంకేతిక రంగాలలో శిక్షణ ఇప్పించడం, అధ్యాపకులకు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ ద్వారా విద్యా వ్యవస్థలో మార్పులు సాధించినందుకు తమ కళాశాలకు ఈ అవార్డు దక్కిందన్నారు. ప్రిన్సిపాల్ డా॥ రాజ్‌కుమార్ మాట్లాడుతూ గతేడాది ప్రతిష్టాత్మక అటానమస్, న్యాక్ ఎ ప్లస్ హోదా కళాశాలకు వచ్చిందన్నారు. ఈ ఏడాది ఐబిఎం అవార్డుతో పాటు ఐటిసి అవార్డు కూడా దక్కడం ఎంతో గర్వకారణమన్నారు. తమ కళాశాలకు ఈ గుర్తింపు అందించడానికి సహకరించిన ఐటిసి అకాడమీ స్టేట్ హెడ్ బి. గోపాల్, రిలేషన్ షిప్ మేనేజర్ ఎస్‌కె గౌస్‌పాషాకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ అభినందన కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, జె. రవీంద్రబాబు, టిపివో ఎన్. సవిత, కో ఆర్డినేటర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

# సొసైటీని సందర్శించిన నాబార్డు బృందం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని వి.వెంకటాయపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ)ని నాబార్డు బృందం సందర్శించింది. గురువారం ముంబాయి నుంచి వచ్చిన నాబార్డు బృందం శ్రేయస్ దేశ్ పాండే, కృష్ణ కోలే తదితరులు సొసైటీని సందర్శించి సొసైటీలో నిర్వహిస్తున్న కార్యకలాపాలను పరిశీలించారు. డిపాజిట్ల సేకరణ, రైతులకు రుణాలు, బంగారం రుణాలు, ఎరువులు, విత్తనాల విక్రయం, స్టాక్ వెరిఫికేషన్, పంట రుణాలను పరిశీలించారు. సొసైటీ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవల పట్ల నాబార్డు బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో డిసిసిబి డిజిఎం వేణుగోపాలరావు, సొసైటీ ఛైర్మన్ రావూరి సైదబాబు, వైస్ ఛైర్మన్ రావెళ్ల శ్రీనివాస్, ఎబి మార్గ బ్రాంచ్ మేనేజర్ ఇందు, సూపర్‌వైజర్ జానిమియా, సొసైటీ కార్యదర్శి ఐ. తిరుపతిరావు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎండిపోతున్న పల్లె ప్రకృతి వనం



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని పుల్లయ్య బంజరలో పల్లె దవఖాన ఆవరణలో ఉన్న పల్లె ప్రగతి వనం నీరు లేక సంరక్షణ చేసేవారు లేక ఎండిపోతుంది. సుమారుగా 2000 ఉండే మొక్కలు రక్షకులు లేక మొక్కలు ఎండిపోతున్నవి. దీనికి పెట్టుబడి కూడా వృధా అవుతుంది. గత ఆరు నెలల క్రితం ఉపాధి హామీ ద్వారా పెంచుతున్న నర్సరీలలో మొక్కలకు నీరు పోసేవారు లేక సంరక్షకులు చూసేవారు లేని కారణంగా దానిలో చెత్త గడ్డి పెరగటంతో పాటు పాములు, తేళ్లకు నిలయంగా మారింది. అదే విధంగా మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఏడు నర్సరీలలో కూడా ఇదే పరిస్థితి నెల కొన్నట్లు చర్చ కొనసాగుతుంది. ఈ విషయమై మున్సిపాలిటీ మేనేజర్ ను వివరణ కోరగా నర్సరీలలో మొక్కలను రక్షించేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు మేనేజర్ నాగేశ్వరావు తెలిపారు.

# స్నానాల లక్ష్మీపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండల స్నానాల లక్ష్మీ పురం గ్రామంలో ఆత్మ చైర్మన్ మట్టూరి వెంకటేశ్వరరావు, వైరా వ్యవసాయ సంచాలకులు తుమ్మలపల్లి కరుణశ్రీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైరా డివిజన్ వ్యవసాయ సంచాలకులు తుమ్మలపల్లి కరుణశ్రీ మాట్లాడుతూ ఎఫ్ఏక్యూ నామ్స్ ప్రకారం వరి ధాన్యాన్ని ప్రతి ఒక్క గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలియజేశారు. దానికి అనుగుణంగా రైతులు తేమ శాతం 17% కంటే తక్కువగా ఉండేవిధంగా, తాలు, చెత్తా చెదారం లేకుండా నాణ్యమైనటువంటి విత్తనాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి అమ్ముకోవాలని రైతులకు పలు సూచనలు తెలియజేశారు. వరి పంట కోత కోసిన తర్వాత వరి దుబ్బలను కాల్చకూడదని కాల్చడం వలన కలిగే నష్టాల గురించి రైతులకు తెలియజేశారు. కాల్చకుండా ప్రత్యామ్నాయంగా వరిగడ్డిని నీళ్లలోనే దున్నడం వలన అది సేంద్రీయ ఎరువుగా మారి తర్వాత పంటకు ఉపయోగపడుతుందని రైతులకు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మేడా రాజేష్, సెంటర్ ఇంచార్జి కొనకాల మురళి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధయక్షులు దొడ్డా పుల్లయ్య, మాజీ సర్పంచ్ అమ్మిక రామారావు, మాజీ ఉప సర్పంచ్ మల్లు రామకృష్ణ, రైతుల కోడూరి సత్యం, సూరపనేని నాగేశ్వరరావు, మాదాసు ఉప్పలయ్య, పొట్లపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పిడిఎస్‌యు రాష్ట్ర 23వ మహాసభలను జయప్రదం చేయండి

**పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి వంగూరి వెంకటేష్**




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** విద్యార్థి హక్కుల సాధనకు, శాస్త్రీయ విద్యా వ్యవస్థ పరిరక్షణకు, సమాన విద్య కోసం ప్రతి విద్యార్థి, యువకుడు ఖమ్మం జిల్లా కేంద్రంలో డిసెంబర్ 5, 6, 7 తేదీలలో జరగబోయే పి.డి.ఎస్.యు తెలంగాణ రాష్ట్ర 23వ మహాసభలను విద్యార్థులు, విద్యావంతులు, సామాజికవాదులు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి వంగూరి వెంకటేష్ పిలుపునిచ్చారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యు) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కల్లూరు డివిజన్ కమిటీ సమావేశం నీలం రామచంద్రయ్య భవనంలో గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి డివిజన్ అధ్యక్షులు శశికిరణ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు కల్లూరు డివిజన్ ప్రధాన కార్యదర్శి షిలర్ పాషా, ఉపాధ్యక్షులు నవీన్ కోశాధికారి ఈశ్వర్, నాయకులు నిఖిల్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిగా రామారావు



**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** ఖమ్మం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ దానలకోట రామారావు గురువారం విధుల్లో చేరారు. ముందుగా పూర్వ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి కళావతిబాయి సమక్షంలో జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఐడిఓసి కాంప్లెక్స్‌లోని మొదటి అంతస్థులో గల వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో రాష్ట్రంలో డిఎంహెచ్‌ఓలకు జరిగిన రెండు రోజుల వర్క్‌షాప్‌లో ఖమ్మం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా పాల్గొన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు డాక్టర్ రామారావును కలిసి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

# మున్సిపాలిటీలో ఎంఎల్‌ఏ కోరం విస్తృత పర్యటన



**-స్వయంగా బైక్ నడుపుతూ పర్యటించిన ఎంఎల్ఏ కోరం**

**ప్రజాపక్షం/ఇల్లందు:** మున్సిపాలిటీలో ఎంఎల్ఏ కోరం కనకయ్య గురువారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా డిఎంఎఫ్‌టి నిధులు 65.70లక్షల అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేశారు. అంతకు ముందు బుగ్గవాగు సైడ్ వాల్ నిర్మాణ పరులు పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 16వ వార్డులో మంచినీటి సమస్య ఉందంటూ మహిళ సోదరీమణులు ఎంఎల్ఏ దృష్టికి తీసుకురావడంతో తక్షణమే యుద్ధ ప్రతిపాదికన మంచి నీరు అందించాలని అధికారులను ఆదేశించారు. ఇల్లందు లెక్ పార్కు నందు స్విమింగ్ పుల్ సెఫ్టీ, పెన్సింగ్ నిర్మాణ పనులకు ఎంఎల్ఏ శ్రీకారం చుట్టారు. పార్కును సుందరీకరించాలని అధికారులకు సూచించారు. ప్రజా ప్రభుత్వంలో ఇల్లందు మున్సిపాలిటీ అభివృద్ధికి 65.70లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. భవిష్యత్‌లో మరిన్ని నిధులు తెస్తామని తెలిపారు. దేశంలోనే సన్నబియ్యం ఇచ్చే ఎకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో 4వేల ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని, భవిష్యత్‌లో మరికొన్ని ఇస్తామని తెలిపారు. ఇల్లందు మున్సిపాలిటీ పర్యటనలో భాగంగా 7, 15,16,17,18,22,24 వార్డులలో సిసి రోడ్, డ్రైనేజ్ వంటి అభివృద్ధి పనులకు ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపనలు చేసి, పలు వార్డులలో మహిళా సోదరీమణుల నెలకొన్న సమస్యలను వారి దృష్టికి తేగా తక్షణమే ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో త్రాగునీరు, డ్రైనేజ్, లైటింగ్ వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, భవిష్యత్ పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వారి వెంట ఇల్లందు మార్కెట్ కమిటీ ఛైర్మన్ బానోత్ రాంబాబు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు పులి సైదులు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు దొడ్డ డానియల్, మాజీ మున్సిపాల్ ఛైర్మన్ అనసూయ, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ జానీపాషా, నాయకులు మడుగు సాంబమూర్తి, బోళ్ళ సూర్యం, చిల్ల శ్రీనివాస్, హరిహర క్షేత్రం ఛైర్మన్ గందె సదానందం, టౌన్ ప్రధాన కార్యదర్శి ఎండి జాఫర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొల్లి రాజు, టౌన్ కార్యనిర్వహక అధ్యక్షులు సుదర్శన్ కోరి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు గిరిజన మ్యూజియం సందర్శించేలా చూడాలి

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఆదివాసి గిరిజన సంస్కృతి సంప్రదాయాలు కాపాడేందుకు, వాటిని చిరకాలం గుర్తుంచుకునే విధంగా ఏర్పాటు చేసుకుని గిరిజన మ్యూజియాన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల విద్యార్థులు సందర్శించే విధంగా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. గురువారం తన ఛాంబర్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పిఓ వారికి కొన్ని సూచనలు చేశారు. గిరిజన సంప్రదాయ వస్తువులు, కళాకండాలు, పాత కాలపు వస్తువులు గిరిజన మ్యూజయంలో పొందుపరచడం జరిగిందని, వీటిని విద్యార్థులకు చూపిండం ద్వారా సాంప్రదాయ పరమైన



విలువలు తెలుస్తాయని అన్నారు. గిరిజన పాఠశాలల్లో 8 నుండి 10వ తరగతి విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ తరగతులు నిర్వహిస్తున్నామని, మంచి ఆదరణ రావడటం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించేందుకు గిరిజన సంక్షేమ శాఖ చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ప్రైవేటు పాఠశాలల్లో పిల్లల ఫీజులు వ్యవహారంలో అనుచితంగా ప్రవరిస్తున్నారని, పిల్లలు క్రమ శిక్షమతో మసులుకోక పోతే తల్లింద్రులకు చెప్పాలని, చదువులు, ఫీజుల విషయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్, డిఇఓ నాగలక్ష్మి, మాధవరావు, బండి లక్ష్మణ్, ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆహారం, ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి

**జీవన యాత్ర సభ్యుల వినూత్న రీతిలో ప్రచారం**

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండల ఆరోగ్య జీవన యాత్ర వాకింగ్ యోగ సభ్యులు ఆరోగ్యం ఆహారం శారీరక వ్యాయామాలు ప్లాస్టిక్ నివారణ పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినూత్న రీతిలో ప్రచారం చేస్తున్నారు. అందులో భాగంగానే జీవన యాత్ర సభ్యుల జన్మదిన వేడుకల్లో మైదా కెమికల్స్ రహితంగా ఫ్రూట్స్ తో తయారుచేసిన కేకులను వాడుతున్నారు. ఎలాంటి సైడ్ ఎఫెక్టు లేని ఫ్రూట్స్ కేకులను తయారు చేసుకోవాలని మైదా కెమికల్స్ లాంటివి ఉపయోగించవద్దని చెబుతున్నారు. అదేవిధంగా ప్లాస్టిక్ వాడకుండా స్టీల్ పళ్లెం స్టీల్ గ్లాసులను ఉపయోగించాలని ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో శరీరంలోని అవయవాలు అకస్మాత్తుగా అనారోగ్యానికి గురి అవుతున్న కారణంగా ప్రతిరోజు నిత్యం తగిన వ్యాయామాలు వాకింగ్ యోగ ధ్యానం లాంటివి చేయాల్సిన తప్పని పరిస్థితి ఏర్పడిందని చెబుతూనే



నిత్యం ఓ వేదిక వద్ద వాకింగ్ యోగ ధ్యానం చేస్తున్నారు. ఆరోగ్య జీవన యాత్ర సభ్యుడు నవీన్ చౌదరి జన్మదిన వేడుక సందర్భంగా ఫ్రూట్స్ తో తయారు చేసిన కేకును వేడుకలు ఉపయోగించారు. సాత్విక ఆహారమైన నానపెట్టిన పల్లీలు, బొప్పాయి, కీరదోస, బాదం, ఖర్జూరం, కిస్మస్, ఈ జీడిపప్పు అలాంటి వాటిని పంపిణీ చేశారు. అదేవిధంగా జూలూరుపాడు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పెన్నులను పంపిణీ చేసి, పర్యావరణం సందర్భంగా ప్రతి ఒక్కరూ జన్మదిన వేడుక రోజున ఒక మొక్కని నాటాలని సూచించి విద్యార్థులచే మొక్కను నాటించారు. ఆరోగ్య జీవన యాత్ర సభ్యులు సమాజంలో ఎవరైనా ఇబ్బందులు గురి అయితే వారి ఇబ్బంది అనుసారం అవసరాన్ని పట్టి కొంత ఆర్థిక సహాయాన్ని సైతం అందిస్తున్నారు.

# నేడు ప్రభుత్వ పాఠశాలలో పీటీఎం సమావేశాలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు, బడికి వస్తున్నారా లేదా... ఆరి ప్రవర్తన ఎలా ఉంది. చదువుల్లో ప్రగతి ఎలా ఉంది తమ పరంగా ఏమీ చేయాలి అనే విషయాలు తెలుసుకునేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు పేరెంట్స్ టీచర్ మీటింగ్ (పీటీఎం) లను శుక్రవారం ఏర్పాటు చేయాలని విద్యా శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు పీటీయం సమావేశాలను పరిశీలించేందుకు రాష్ట్ర స్థాయి బృందాలు పాఠశాలలను తనిఖీ చేయనున్నారు. ఈసమావేశం కు విద్యార్థులు తల్లిదండ్రులు నూరు శాతం హాజరైయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రతీనెలా మూడో శనివారం జరిగే పీటీయం సమావేశం నిర్వహిస్తారు. గతంలో జిల్లాలో పలు చోట్ల ఉపాధ్యాయులు శ్రద్ధ చూపి అహ్వాన ప్రతాలు అందించి చేతులు దులుపుకున్నారు. వివిధ కారణాల వలన తల్లిదండ్రులు చాలా వరకు హాజరు కావటం లేదు. జిల్లాలో పలు చోట్ల కనీసం 10 శాతం కూడ హాజరు కావటం లేదు. దీంతో మొక్కుబడి గా సమావేశాలు నిర్వహించారు. ఖమ్మం జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు814, ప్రాథమికొన్నత పాఠశాలలు191, ఉన్నత పాఠశాలలు112 మొత్తం 1217 పాఠశాలలో శుక్రవారం పీటీఎంసమావేశాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 14 న జరిగే పాఠశాల సమావేశాల కు వంద శాతం హాజరైయ్యేలా చూడాలని ఉపాధ్యాయులతో పాటు పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ ఏపీఎం లకు ఆదేశాలు జారీ చేశారు. సమావేశం ఫోటోలు, వివరాలు అప్లోడ్ చేయాలని ఆదేశించారు.

**నేడు రాష్ట్ర స్థాయి బృందాలు తనీఖీలు : ప్రవీణ్ కుమార్, సీఎంవో, ఖమ్మం**

బాలల దినోత్సవం సందర్భంగా జరిగే తల్లిదండ్రుల, టీచర్ల సమావేశంకు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశాం. ఈ సమావేశాలను రాష్ట్ర స్థాయి బృందాలు తనీఖీలు చేపట్టనున్నారు. విజయవంతంగా నిర్వహించి యాప్ లో నమోదు చేయాలని ఆదేశించాం. నివేదికలు తయారు చేసేందుకు బృందాలు పలు పాఠశాలలు సందర్శించనున్నాయి.

# విధులకు ఆటంకం కలగకుండా ట్రైనింగ్

**ప్రజాపక్షం/పాల్వంచ :** అధికారుల విధులకు ఆటంకం కలగకుండానే తన ట్రైనింగ్‌ను పూర్తి చేసుకొంటానని ట్రైనీ ఖలెక్టర్ సౌరభ్‌శర్మ అన్నారు. ట్రైనింగ్‌లో భాగంగా గురువారం పాల్వంచ తహశీల్దార్ కార్యాలయానికి చేరుకొన్నారు. ఈ సంధర్భంగా తహశీల్దార్ దారా ప్రసాద్‌ను రెవిన్యూశాఖ సంభందించిన విషయాలను అడిగి తెలుసుకొన్నారు.వోల్టా, అసైన్‌మెంట్ భూములు, ఎంక్రోచ్‌మెంట్, ఎలాటిఆర్, బైండోవర్ చట్టాలపై తహశీల్దార్ అవగాహన కల్పించారు.



# బీసీ ఒక్క రోజు దీక్ష విరమణ

**ప్రజాపక్షం/మణుగూరు:** బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ బీసీ రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపుమేరకు మణుగూరులో గురువారం అంబేద్కర్ సెంటర్‌లో బీసీల ధర్మ పోరాట దీక్ష ఒకరోజు నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ హాజరై సంపూర్ణ సంఘీభావాన్ని మద్ద తు ప్రకటించారు. సాయంత్రం సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, బీసీ సంఘం నాయకులు వలసాల వెంకట రామారావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, ఏఐటియుసి మండల కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి సోమేశ్వర గౌడ్, బీసీ సంఘం జిల్లా నాయకులు పెనుగొండ సాంబ తదితరులు బీసీ సంఘాల నాయకుల కు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు.



# చర్ల నుండి రాజమండ్రి నూతన ఆర్‌టిసి సర్వీసు ప్రారంభం

**ప్రజాపక్షం/భద్రాచలం :** చర్ల నుండి రాజమమండ్రి వరకు టిఎస్ ఆర్‌టిసి భద్రాచలం డిపో నూతన సర్వీసును గురువారం నుండి ప్రారంభించింది. ఈ సర్వీకును స్థానిక ఎంవిఐ వెంకటపుల్లయ్య లాంఛనంగా ప్రారంభించారు. చర్ల నుండి సాయంత్రం 4.40 గం.లకు బయలుదేరి భద్రాచలం,కుక్కునూరు, అశ్వారావుపేట మీదుగా రాత్రి 10.30 గం.లకు రాజమండ్రి చేరుకుంటుందని డిపో మేనేజర్ జంగయ్య తెలిపారు. ఈ సర్వీసును ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా కార్తీక మాసం చివరి వారమైన 16వ తేది ఆదివారం రాత్రి 8 గం.లకు పంచారామ క్షేత్రాల బస్సు బయలు దేరుతుందని, దీనిని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



# సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/ఇల్లందు:** సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను ప్రదర్శన జయప్రదం చేయాలని కోరుతూ గడపగపడకు సిపిఐ కార్యక్రమం గురువారం మండలంలో నిర్వహించారు. ఇందులో భాగంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే సారయ్య ఆధ్వర్యంలో సభ విజయవంతం కోసం నిధుల సమీకరణ చేశారు. 21 ఏరియాలోని రవి ఫెర్టిలైజర్ షాప్ యజమాని 10వేల రూపాయలు సిపిఐ సభ విజయవంతం కోసం విరాళం ఇచ్చారు. తర్వాత ఆ ప్రాంతంలోని కార్యకర్తలను పార్టీ సానుభూతిపరులను కలిసి డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిర్గ సభకు రైతులు, వ్యవసాయ కూలీలు, చేతి వృత్తుల వాళ్ళు, మహిళలు, యువకులు, విద్యార్థులు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, ఇల్లందు మండల పట్టణ కార్యదర్శులు బొప్పిశెట్టి సత్యనారాయణ, బాస శ్రీనివాస్, సిపిఐ నాయకులు మంచాల వెంకటేశ్వర్లు, ఆలెం రాఘవేంద్రరావు, గుగులోత్ కృష్ణ, గుడిపల్లి భాస్కర్, తాండ్ర లక్ష్మి నారాయణ, వలి, ఖాసీం, జక్కలు కనకయ్య, కోటిలింగం, తదితరులు పాల్గొన్నారు.




# పత్తి రైతులను మోసం చేస్తున్న దళారులపై చర్యలు తక్షణమే తీసుకోవాలి

**ప్రజాపక్షం/ములకలపల్లి:** పత్తి రైతులను మోసం చేస్తున్న దళారి వ్యాపారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలియజేసి తహసీల్ధార్ భగవాన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ ప్రాంతాల నుండి దళారులు రైతుల వద్దకు వచ్చి తడిసిన పత్తి అంటూ అతి తక్కువ 3000 రూపాయలకు తీసుకుంటూ రైతులను మోసం చేస్తున్నారని అన్నారు. అమాయకమైన ఆదివాసి, గిరిజన పేద రైతులను దళార్లు, వడ్డీ వ్యాపారులు తక్కువ ధరలకు పంటలు కొనుగోలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో నాయకులు ఊకంటి రవికుమార్, నిమ్మల మధు, బైరు ప్రసాద్, గడ్డం వెంకటేశ్వర్లు, తేజావత్ జగ్గు, వర్షా కన్నయ్య, బొడ్డు కృష్ణ, కణితి కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.



# పేదల జీవనోపాధులను మెరుగుపర్చడమే ప్రభుత్వం లక్ష్యం

**-పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి**



**ప్రజాపక్షం/ తిరుయమలాపాలెం :** తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం పేదల జీవనోపాధులను మెరుగుపర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని, ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి పేదల సంక్షేమానికి ఉపయోపడేలా ప్రణాళిక బద్ధంగా సంక్షేమ పథకాలను రూపొందించి పేదల అభివృద్ధికి కృషి చేస్తుందని పాలేరు శాసనసభ్యులు, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొక్కిరేణి గ్రామంలో సిసి రోడ్లు, కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం తిరుమలాయపాలెం కేజివిబి పాఠశాల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవాడికి ఇల్లు ఉండాలని లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిందని, తిరుమలాయపాలెం మండలంలో మొత్తం 370 ఇండ్లు మంజూరు కాగా ఇప్పటికే పూర్తి కావస్తున్నాయని, ఇళ్లు నిర్మాణానికి కావాల్సిన నగదును లబ్ధిదారుల ఖాతాలో ప్రతి సోమవారం జమ చేస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో రెండో విడత ఇందిరరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని, మూడో విడతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అవుతాయని ఆయన తెలిపారు. రైతుల సంక్షేమం కోసం పత్తి రైతులు మోసపోవద్దని ఉద్దేశ్యంతో సిసిఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని వరి రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోకుండా ఐకెపి సొసైటీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని తెలిపారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, పొదుపు సంఘాలకు పావలా వడ్డీ రుణాలు పొదుపు సంఘాల మహిళలను కోటీశ్వరులను చేసేందుకు చిరువ్యాపారాలు ప్రారంభించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఇప్పటికే మండలంలో అంతర్గత సిసి రోడ్లు, ప్రధాన గ్రామాలకు బిటి రోడ్లు, అంతర్ జిల్లా రోడ్లు ప్రారంభించామని, గ్రామాల్లో నూతన గ్రామపంచాయతీ కార్యాలయాలు పూర్తి కావస్తున్నాయని తెలిపారు. పాలేరు నియోజకవర్గంలో వేల కోట్ల రూపాయలు ప్రభుత్వం ఖర్చు చేస్తుందని, రానున్నరోజుల్లో సీతారామ ప్రాజెక్టు ద్వారా కృష్ణ ఆయకట్టుకు కూడా గోదావరి నీళ్లు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి, పాలేరు డివిజన్ స్పెషలాఫీసర్ రమేష్, మండల స్పెషలాఫీసర్ పుల్లయ్య, తహాశీల్దార్ లూథర్ విల్సన్, ఎంపిడిఓ ఎస్కె సిలార్‌సాహెబ్, ఎంపిఓ ప్రభాకర్, పాలేరు ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేష్‌రెడ్డి, మాజీ జెడ్పిటిసి బెల్లం శ్రీనివాస్, మాజీ ఎంపిపిలు కొప్పుల అశోక్, బోడ మంగీలాల్ నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జడల నరేష్‌గౌడ్, ఓరా వెంకటేశ్వర్లు, పొట్ల కిరణ్, తాటికొండ కిరణ్, సిరిగద్దే ఉపేందర్, గోళ్ల లింగయ్య, గుగ్గిల అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా పోలీసుల విస్తృత తనిఖీలు

**-అనుమానిత వ్యక్తుల వివరాలు సేకరణ**



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** నేరాల నియంత్రణ, చట్టవ్యతిరేక కార్యాకలాపాలను కట్టుదిట్టం చేసేందుకు పోలీసు కమిషనర్ సునిల్ దత్ ఆదేశాల మేరకు గురువారం జిల్లా వ్యాప్తాంగా అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో స్థానిక ఎస్‌హెచ్‌ఓలు, సిబ్బంది విస్తృత తనిఖీలు చేపట్టారు. విజబుల్ పోలీసింగ్‌ను పట్టిష్టంగా అమలు చేస్తేనే నేరాలు నియంత్రించవచ్చనే నేపధ్యంలో తనిఖీలు చేపడుతున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. ఆర్థరాత్రి రోడ్లపై తిరుగుతున్న వ్యక్తులు, వాహనాలను తనిఖీ చేసి వారిని విచారించి అనుమానితుల వివరాలు సేకరిస్తున్నారు. వారిపై సిటి పోలీస్‌యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తున్నారు. అదేవిధంగా సరిహద్దు రాష్ట్రాల మీదుగా గంజాయి, రేషన్ బియ్యం, ఇసుక వంటి అక్రమ రవాణాతో పాటు పాత నేరస్తుల కదలికను కట్టడిచేసేలా జిల్లా పోలీసు యంత్రాంగం వాహనాల తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. ప్రధాన రహదారులతో పాటు రద్దీ ప్రాంతాలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌లలో జోరుగా సోదాలు చేస్తున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# క్రషర్‌లలో అక్రమాలకు చెక్

**- సిసి కెమెరాలతో కార్యాలయానికి అనుసంధానం**



**ప్రజాపక్షం/పాల్వంచ :** క్వారీ క్రషర్ మిల్లులలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం నూతన మార్గదర్శకాలను విడుదల చేసింది. తప్పుడు లెక్కలతో ప్రభుత్వాన్ని బురిడీ కొట్టించి చెల్లించాల్సిన రాయల్టీని కట్టకుండా పెద్దమొత్తంలో ఎగవేతకు పాల్పడతున్న వారిపై పంజా విసరటానికి, ఆదాయాన్ని పెంచుకోవటానికి నూతన విధానాలను రూపొందించింది. డిసెంబర్ మొదటి తేదీ నుండి అమల్లోకి రానున్నాయి. జిల్లాలోని క్రషర్ మిల్లులలో సిసి టీవి, ఏపిఎన్ఆర్ కెమెరాలను ఏర్పాటు చేసుకొని జిల్లా కార్యాలయానికి అనుసంధానం చేయాలి. క్రషర్‌లలో సిసి కెమెరాలు,వాహనాలకు సంభందించిన వివరాలు, క్యాప్చర్ చేసే కెమెరాలను అమర్చుకోవాలని సూచించారు.వీటిని జిల్లా కేంద్ర మైనింగ్ ఏడి అధికారుల మొబైల్ ఫోన్‌లకు అనుసంధానించాలని ఆదేశించారు. ప్రతీ నెలా 10వ, తేదీలోపు రాయల్టి చెల్లించాలన్నారు. లేనిచో కఠిన చర్యలు తీసుకోనున్నామని హెచ్చరించారు. కావునా క్రషర్ మిల్లు యాజమాన్యాలు ప్రభుత్వ నిభంధనల మేరకు క్రషర్ నిర్వహించాలని సూచించారు.

# బొగ్గు నాణ్యత వారోత్సవాలు 2025 ప్రారంభం



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు ఏరియా సింగరేణి జిఎం కార్యాలయంలో గురువారం బొగ్గు నాణ్యత వారోత్సవాలను ఏరియా జనరల్ మేనేజర్ వి కృష్ణయ్య నాణ్యత పతాకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి, రవాణా అన్ని రంగాలలో కొత్త రికార్డులు సృష్టిస్తూ ముందుకు సాగుతుందని, దక్షిణ భారతదేశంలోనే అగ్రగామి బొగ్గు ఉత్పత్తి సంస్థ అయిన మన సింగరేణి దేశంలోనే అగ్రగామి బొగ్గు ఉత్పత్తి సంస్థ అయిన మన సింగరేణి దేశంలోని వివిధ సంస్థలకు ముఖ్యంగా విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేస్తూ మన దేశ ఆర్థిక ప్రగతిలో సుస్థిర స్థానం సంపాదించుకున్నదని, అయితే ప్రస్తుత పోటీ మార్కెట్‌లో ఇతర బొగ్గు సంస్థలకు ధీటుగా సింగరేణి సంస్థ కూడా తన బొగ్గు నాణ్యత ప్రమాణాలు మరితంగా పెంచుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఏ సంస్థకైనా దాని మనుగడను, పురోభివృద్ది ఆ సంస్థ ఉత్పత్తి ఉత్పాదకతలతో పాటు ఉత్పత్తి అయిన వస్తూ నాణ్యతపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. అంతే కాకుండా నాణ్యమైన బొగ్గు సరఫరా ద్వారా తక్కువ ధరకే విద్యుత్ ఉత్పాదక సాధ్యమై తద్వారా వినియోగదారులకు ఆర్థిక భారం తగ్గి లబ్ది చేకూరుతుందని తెలిపారు. అదే విధంగా బొగ్గు నాణ్యత వారోత్సవాల సందర్భంగా ఇల్లందు ఏరియాలోని జెకె ఉపరితల గని నందు కోయగూడెం ఉపరితల గని నందు బొగ్గు నాణ్యత వారోత్సవాలు ప్రారంభించి అందరు అధికారులు, ఉద్యోగులచే నాణ్యత ప్రమాణ ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో యస్వోటు జిఎం రామస్వామి, ఏజిఎం(ఐఈడి) గిరిధర్, ప్రభాకర్ రావు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్, ఏరియా ఇంజనీర్ నరసింహారాజు, డిజిఎం(పర్సనల్) అజ్మీర తుకారం, డిజియం(సివిల్)రవి కుమార్, ఏరియా బొగ్గు నాణ్యతాధికారి రామదాసు, ఇతర అధికారులు, దిలీప్ కుమార్, రామమూర్తి, అంజిరెడ్డి, శివ వీర కుమార్, సుధాకర్, నాగేశ్వరరావు, శ్యాం ప్రసాద్, అజయ్, అధికారుల సంఘం అధ్యక్షులు ఏజి శివ ప్రసాద్, గుర్తింపు సంఘం నుండి లచ్చిరం, ప్రాతినిధ్య సంఘం ఉపాధ్యక్షులు జె వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# 13 ఉద్యోగుల తొలగింపు ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలి

**ప్రజాపక్షం/పాల్వంచ :** నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలో ఎంఆర్‌సి స్టాఫ్ ఉద్యోగులను తొలగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని సమగ్రశిక్షా ఉద్యోగుల సంఘం నాయకులు అన్నారు. ఆసంఘం రాష్ట్ర కమిటి ఇచ్చిన పిలుపులో భాగంగాగురువారం భోజన విరామ సమయంలో మండల విద్యా వనరుల కేంద్రం ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సంధర్భంగా తప్పులపై సరైన విచారణ కొనసాగించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఏకపక్షంగా ఉద్యోగులను తొలగించటం సరైంది కాదన్నారు.వెంటనే ఉత్తర్వులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు భట్టు చందు, అర్జున్, ఐఈఆర్పి దుర్గ, అనిత, సిఆర్‌పిలు ప్రభాకర్, గంగరాజు, కిషన్, శ్రీనివాస్,మెసేంజర్ ఉపేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



**ప్రజాపక్షం/వైరా:** ప్రతి విద్యార్థి చదువుతో పాటు కనీసం ఓ ఇండోర్, ఔట్‌డోర్ గేమ్స్‌లో సత్తా చాటాలని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి ప్రభుత్వ ప్రతిష్టాత్మక సంక్షేమ పథకాల ప్రత్యేక కార్యదర్శి(స్పెషల్ సెక్రటరీ టు గవర్నమెంట్ వెల్ఫేర్ అండ్ డవలప్‌మెంట్) బడుగు సైదులు అన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బిసి గురుకుల విద్యాసంస్థల డిస్ట్రిక్ట్ లెవెల్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్ ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చదువులోనే కాదు ఆటల్లోను విద్యార్థులు రాణించాలని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో సత్తా చాటిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని, రాష్ట్రస్థాయిలోను రాణించిన విద్యార్థులను జాతీయ స్థాయిలో పతకాలు సాధించేలా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. ప్రతి ఏడాది తరహాలోనే ఈ అకాడమిక్ ఇయర్‌లోను ఉత్తీర్ణత శాతంలో బాలికలు పైచేయి సాధించాలన్నారు. విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. పాల్గొన్న ప్రతి విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ నెల15 నుంచి 25 వరకు జిల్లాస్థాయిలో సాంస్కృతిక, సాహిత్య, వ్యాసరచన, చిత్రలేఖనం వంటి తదితర పోటీలను కూడా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికైన విద్యార్థులు వచ్చే నెల రాష్ట్రస్థాయిలో నిర్వహించే కల్చరల్ కార్నివాల్‌లో పాల్గొంటారని తెలిపారు. రెబ్బవరంలోని ముసలిమడుగు స్కూల్ వేదికగా బాలికల స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ముగింపు కార్యక్రమం, వనం వారి కృష్ణాపురంలోని బోనకల్ జూనియర్ కాలేజీలో జరిగిన బాలుర స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్సివో, చింతమల్ల రాంబాబు, ఖమ్మం జిల్లా డిసివో ఎం.సుష్మ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిసివో వి.బ్యాలా, రాణి, జ్యోతి, ముసలిమడుగు ప్రిన్సిపాల్ కె.రాధిక, వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. బాలికల్లో అండర్ 14 విభాగంలో ఓవరాల్ చాంపియన్‌గా ముసలిమడుగు గర్ల్స్ స్కూల్ నిలిచింది. వ్యక్తిగత చాంపియన్‌షిప్(ఇండివిద్యుల్ చాంపియన్‌షిప్)ను వైరా గర్ల్స్ స్కూల్ విద్యార్థిని వి.భాను తేజ తెలుచుకుంది. అండర్ 19 విభాగంలో ఓవరాల్ చాంపియన్‌గా లంకపల్లి జూనియర్ కాలేజి, వ్యక్తిగత చాంపియన్‌షిప్‌ను సత్తుపల్లి జూనియర్ కాలేజికి చెందిన విద్యార్థిని ఎన్.మాధురి విజేతలుగా నిలిచారు. బాలురల్లో అండర్ 14 విభాగంలో ఓవరాల్ చాపింయన్‌గా కూసుమంచి స్కూల్ నిలిచింది. వ్యక్తిగత చాంపియన్‌షిప్(ఇండివిద్యుల్ చాంపియన్‌షిప్)ను కూసుమంచి స్కూల్ విద్యార్థి కె.యశ్వంత్ గెలుచుకున్నాడు. అండర్ 19 విభాగంలో ఓవరాల్ చాఇంపియన్‌గా రఘునాధపాలెం, వ్యక్తిగత చాంపియన్‌షిప్‌ను రఘునాధపాలెం విద్యార్థి ఆర్.రామ్‌కిషోర్ విజేతలుగా నిలిచారు. మొత్తంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా విద్యాసంస్థల నుంచి డిస్ట్రిక్ట్ లెవెల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో 520 మంది బాలురు, 520 మంది బాలికలు పోటీల్లో పాల్గొన్నారు. కాగా ఈ నెల6 నుంచి 8వ తేది వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయిలో జరిగిన అండర్ 17 విభాగంలో కూసుమంచి బాయ్స్ స్కూల్ ముసలిమడుగు గర్ల్స్ స్కూల్ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచాయి.

# బర్ల వెంకటేశ్వర్లు సేవలు అభినందనీయం

**-ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్**




**ప్రజాపక్షం/బూర్గంపాడు :** లక్ష్మీపురంలో గల ఫిమాకెం ఇండియా లిమిలెడ్ ఫ్యాక్టరీ నందు గత 27 సంవత్సరాలుగా కార్మికునిగా బర్ల వెంకటేశ్వర్లు అందించిన సేవలు అభినందనీయమని ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ అన్నారు. గురువారం లక్ష్మీపురం గ్రామంలోని ఫిమాకెం ఇండియా లిమిటెడ్ నందు గత 27 సంవత్సరాలుగా కార్మికుడిగా, నేడు హై స్కిడ్ కార్మికుడిగా పని చేసిన బర్ల వెంకటేశ్వర్లు రిటైర్మెంట్ వేడుకలను కార్మికుల సమక్షంలో ఫ్యాకర్టీ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 1999 ఫిబ్రవరి నుంచి కార్మికుడిగా విధులలో చేరి, కార్మికుల కొరకై అందరినీ కలుపుకొని ఫ్యాక్టరీలో ఏఐటియుసి యూనియన్‌ను స్థాపించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. సమిష్టి నిర్ణయాలతో యూనియన్ బాగోగులను చూసి నేడు హై స్కిల్ కార్మికుడిగా అంచలంచలు ఎదిగి, ఫ్యాక్టరీ ఎదుగుదలలో తన వంతు కృషి చేసి నేడు రిటైర్డ్ అవుతున్న బర్ల వెంకటేశ్వర్లుకు కార్మికులు అంతా సంతోషంగా పదవీ విరమణ వీడ్కోలు తెలపడం హర్షనీయమని అన్నారు. అనంతరం ఫిమాకెం ఇండియా లిమిటెడ్ జీఎం రఘు మాట్లాడుతూ కార్మికులకు సేవలను అందించడంతో బర్ల వెంకటేశ్వర్లు ఎప్పుడు ముందు ఉండేవారని తెలిపారు. తన పదవి విరమణ జీవితం కుటుంబంతో సంతోషంగా గడపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా నాయకులు మల్లికార్జున్, గడ్డం వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి సబ్కా నాగేశ్వరరావు, పేరాల శ్రీనివాసరావు, అలవాల సీతారాంరెడ్డి, సుబ్బారెడ్డి, నాగరాజ్, తోకల శ్రీను, యూనియన్ నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు, అప్పారావు, చందర్ రావు, లక్ష్మీ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.